


రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31(గురువారం)
కనిష్ఠం : 26

ఉపాధ్యాయుల బదిలీలకు ముగిసిన దరఖాస్తు ప్రక్రియ 6

రేపు సీఎం రాక

- కోనసీమ జిల్లా ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లో అధికారిక కార్యక్రమాలో పాల్గొననున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఏర్పాట్లు చేస్తున్న కోనసీమ జిల్లా అధికార యంత్రాంగం
- సీఎం పర్యటన షెడ్యూల్ విడుదల



అమలాపురం, మే 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 31న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రానున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో గల ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లో ఏర్పాటు చేసిన అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పీ4లో భాగంగా పేదల దత్తత కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత ఉపాధి హామీ కూలీలతో మమేకమవుతారు. నలుగురు పెన్షనర్లతో మాట్లాడతారు. తర్వాత ముమ్మిడివరం నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారు.

సీఎం పర్యటన సాగేదిలా..

- ఆరోజు ఉదయం 9.30గంటలకు ఢిల్లీలోని జనపథ్ నుంచి బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 10.10గంటలకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరతారు.
- 12.25 గంటలకు రాజమహేంద్రవరం మధురపూడి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 12.30 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరతారు.
- 12.50గంటలకు ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 12.50 గంటల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు సీఎంను కలుస్తారు.
- 1.20 గంటలనుంచి 2.05గంటల వరకు పీ4 కార్యక్రమంతోపాటు పింఛన్ల పంపిణీ తర్వాత గ్రామస్తులతో భేటీ అవుతారు.
- 2.05 గంటలకు బయలుదేరి సీహెచ్ గున్నేపల్లి ట్యాంక్ ఏరియాకు చేరుకుంటారు.
- 2.10 గంటల నుంచి 3.30 గంటల వరకు గ్రామంలో ప్రజలతో మాట్లాడతారు.
- 3.35గంటల నుంచి 5 గంటల వరకు అక్కడే టీడీపీ కేడర్‌తో సమావేశమవుతారు.
- 5.10 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుని హెలికాప్టర్‌లో బయలుదేరతారు.
- 6 గంటలకు తాడేపల్లి మండలం ఉండవల్లిలోని స్వగృహానికి చేరుకుంటారు.

పుష్ప తరహాలో గంజాయి స్మగ్లింగ్

- ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పట్టివేత
- లారీ సహా రూ.22లక్షల విలువైన 730 కిలోల గంజాయి స్వాధీనం
- ఐదురోజుల క్రితం దేవరపల్లిలో మోటారుసైకిల్‌ను ఢీకొన్న లారీడ్రైవర్
- పోలీసులకు భయపడి అప్పటినుంచి లారీని యర్నగూడెంలో దాచిన వైనం
- సమాచారంతో పరిసరాల్లో వెతికి లారీని పట్టుకున్న పోలీసులు
- లారీ క్యాబిన్ వెనుక రహస్య అర కింద గంజాయి గుర్తింపు
- లారీడ్రైవర్ అరెస్టు.. మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు

మెయిన్‌లో..



వివరాలు వెల్లడిస్తున్న దేవరపల్లి పోలీసులు



లారీ క్యాబిన్ వెనుక ఏర్పాటు రహస్య అర

కొంచెమే పెంపు

- ధాన్యానికి కనీస మద్దతు ధర పెంచిన కేంద్రం 7
- క్వింటాలుకు రూ.69 పెంపు
- గ్రేడ్ ఏ రకం రూ.2,369
- సాధారణ రకం రూ.2,252
- ఉమ్మడి జిల్లాలో 14.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా

నో..పరేషన్



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)
'ఎప్పుడు వస్తుందో తెలియదు.. ఎక్కడ ఉంటుందో తెలియదు.. ఎంతసేపు ఉంటుందో తెలియదు.. ఒకచోట మిస్సయితే.. మరో చోటకు వెళ్లి తెచ్చుకోవాలి. ఒక్కోసారి వాహనం కనిపించినా.. గంటల తరబడి సరకుల కోసం పడిగాపులు.. ఒక్కోసారి బియ్యం లేవనే సమాధానం..' గత వైసీపీ ప్రభుత్వంలో రేషన్ సరకులు పంపిణీ చేసే ఎండీయూ వాహనాలతో రేషన్ కార్డుదారుల అనుభవాలివీ.. వీటన్నింటికీ చెక్ పెడుతూ.. కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక జూన్ ఒకటో తేదీ నుంచి నేరుగా రేషన్ దుకాణాల నుంచే సరకులు పంపిణీ చేసేలా ఏర్పాటు చేస్తోంది. వైసీపీ హయాంలో ఇంటింటికి రేషన్ సరకులు అందజేస్తామని చెప్పిన ప్రభుత్వం.. కార్డుదారులను నడి వీధిలో నిలబెట్టింది. ఈ సమస్యను చక్కదిద్దేందుకు కూటమి సర్కారు పాత విధానంలోనే రేషన్ దుకాణాల వద్దే సరకులు అందించేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

- ఉమ్మడి జిల్లాలో జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల్లోనే బియ్యం
- పిఠాపురంలో ప్రారంభించనున్న సివిల్ సప్లయిస్ మంత్రి నాదెండ్ల
- ప్రతినెలా 1వతేదీనుంచి 15తేదీ వరకు దుకాణాల్లో ఇచ్చేలా ప్రణాళిక
- వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ ఇచ్చేలా ఏర్పాట్లు
- పక్కాగా కొత్త విధానం అమలయ్యేలా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2,857రేషన్ దుకాణాల్లో 17.46 లక్షల మంది కార్డుదారులకు 26లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం
- తూకం మోసం లేకుండా ఎలక్ట్రానిక్ కాటాలపై అధికారుల పరిశీలన
- ఎండీయూ వాహనాల రద్దుతో ఇకపై కార్డుదారులకు తీరిన కష్టాలు
- నచ్చినప్పుడు రేషన్‌డీలర్ వద్దకు వెళ్లి బియ్యం, సరుకులు తెచ్చుకునే వీలు
- గత ప్రభుత్వంలో బియ్యం వాహనాలతో కార్డుదారులకు నరకం
- ఎప్పుడు బియ్యం బండి వస్తుందో తెలియక పడిగాపులు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,857 రేషన్ దుకాణాల్లో 17.46లక్షల మంది కార్డుదారులకు 26లక్షల మెట్రిక్‌టన్నుల బియ్యం పక్కాగా సరఫరా చేసేలా డీలర్లను అప్రమత్తం చేసింది. రేషన్‌దుకాణాల్లో తూకం మోసం లేకుండా ఎలక్ట్రానిక్ కాటాలపై అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.

బెంగ లేదిక..

జూన్ 1 నుంచి రేషన్‌దుకాణాల్లో బియ్యం పంపిణీ నేపథ్యంలో పౌరసరఫరాల సంస్థ, పౌరసరఫరాలశాఖల అధికారులు రేషన్ దుకాణాలకు సరకుల తరలింపు, కచ్చితమైన తూకంతో పేదలకు అందించే చర్యలు మొదలుపెట్టారు. ఎంఎల్ఎస్ పాయింట్లు వద్ద వే బ్రిడ్జిలను పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తున్నారు. మరో మూడురోజులు మాత్రమే సమయం ఉండడంతో రేషన్ షాపులను సన్నద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. రేషన్ సరకుల సరఫరాలో లోటుపాట్లపై డీలర్ల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ఇక తూనికలు, కొలతలశాఖల అధికారులు కూడా రేషన్ దుకాణాల్లోని కచ్చితమైన తూకాలు ఉండేలా యంత్రాలను పరిశీలిస్తున్నారు. చాలా వరకు డీలర్ల వద్ద ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు పాడైపోయిన నేపథ్యంలో వాటిని మరోసారి తనిఖీ చేసి, సీల్ వేస్తున్నారు. ఈ పనిలో ఐదురోజులుగా ఈ శాఖ అధికారులు బిజీగా ఉన్నారు. ఈనెల 30వ తేదీలోపు మొత్తం రేషన్ దుకాణాలన్నింటికీ సరకును రవాణా చేసేలా పౌరసరఫరాలశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వైసీపీ హయాంలో..

కాగా రేషన్ బియ్యాన్ని నెలలో తనకు కావలసిన సమయంలో కార్డుదారులు రేషన్ దుకాణానికి వెళ్లి తెచ్చుకునే అవకాశం 2019 వరకు అమలవగా తర్వాత జగన్ వచ్చాక ఈ వ్యవస్థకు తూట్లు పొడిచారు. నచ్చిన రోజు, నచ్చిన సమయానికి రేషన్ దుకాణానికి వెళ్లి బియ్యం తెచ్చుకునే వెసులుబాటును రద్దు చేసి కార్డుదారులకు నరకం చూపించింది. తొలుత ఇంటింటికి వెళ్లి ఈ వాహనంలో బియ్యం పంచుతామని చెప్పి మాట మార్చారు. ఒక కాలనీకి వెళ్లి ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనం సైరన్‌తో ప్రదర్శిస్తే గంటల తరబడి ఆ కాలనీవాసులు నిలబడి బియ్యం తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఆరోజు వాహనం వద్దకు వెళ్లకపోతే ఆ నెల బియ్యం పోయిన పరిస్థితి తలెత్తింది. వేరే ప్రాంతంలో వాహనం కనిపిస్తే బియ్యం ఇచ్చేవారు కాదు. బియ్యం ఇచ్చినట్లే ఇచ్చి అక్కడే తిరిగి కొనేవారు. ఈ రేషన్ బియ్యం అంతా తిరిగి వైసీపీ నేతల కనుసన్నల్లో నడిచే రేషన్‌మాఫియాకు ఈ వాహనాలు తరలించేవి. రేషన్ మాఫియాకు ఇవి అడ్డగోలుగా ఉపయోగపడ్డాయి. బియ్యం వాహనాలను అప్పటి ప్రభుత్వం రూ.5.81లక్షల చొప్పున బ్యాంకు రుణంపై కొనుగోలు చేసి ఆపరేటర్లకు అందించింది. మొత్తం 72నెలల వాయిదాపై బ్యాంకునుంచి 2021, ఫిబ్రవరిలో రుణం తీసుకుంది. కాకినాడ జిల్లాలో 420, తూర్పుగోదావరి జిల్లాలో 364, కోనసీమ జిల్లాలో 355 వాహనాలను బ్యాంకు నుంచి రూ.66.19కోట్లు రుణం ద్వారా కొనుగోలు చేసింది. ఇప్పటికీ ఈరుణాన్ని ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ వాహనాలపై రూ.6.83కోట్లు బాకీ ఉంది.



కాకినాడ రంగయ్యనాయుడు వీధిలోని ఓ రేషన్ దుకాణంలో తూకపు యంత్రాలను పరిశీలిస్తున్న తూనికలు, కొలతలశాఖ అధికారులు

ఏం జిల్లాలో ఎన్నంటే..

కాకినాడ జిల్లాలో 1,060రేషన్ దుకాణాలు ఉండగా, వీటి పరిధిలో 6.43లక్షలమంది కార్డుదారులున్నారు. కోనసీమ జిల్లాలో 926 రేషన్ దుకాణాల్లో 5.38లక్షలమంది, తూర్పుగోదావరి జిల్లాలో 871దుకాణాల ద్వారా 5.65లక్షల మంది కార్డుదారులున్నారు. వీరందరికీ ఉమ్మడి జిల్లాలో 26లక్షల మెట్రిక్ టన్నుల వరకు రేషన్ బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. ఈ మేరకు అన్ని రేషన్ దుకాణాల్లో ఈ వ్యవస్థ పక్కాగా పనిచేసేలా మూడు జిల్లాల్లో పౌరసరఫరాలశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కార్డుదారులు నచ్చిన సమయంలో బియ్యం విడిపించుకునేందుకు వీలుగా 15రోజులపాటు దుకాణాల్లో బియ్యం ఉండేలా చూడాలని డీలర్లను ఆదేశించారు. ఈ నేపథ్యంలో రేషన్ దుకాణాల్లో ఈ నెల ఒకటి నుంచి 15 వరకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఈ దుకాణాలు తెరిచి ఉంచనున్నారు. షాపు పనివేళలు, ధరలు, సరకు నిల్వను సూచించే బోర్డును తప్పనిసరిగా ప్రదర్శించాలని ఇప్పటికే డీలర్లకు అధికారులు ఆదేశాలిచ్చారు. ఇక 65ఏళ్లు పైబడిన వారికి, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దకు వెళ్లి సరకులు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

తవ్వేదెవరు

- జిల్లాకు కేటాయించిన ఇసుక ర్యాంపుల వెనుక ఎవరున్నారు
- కాంట్రాక్టు కంపెనీ కాకుండా ఇంకెవరు పెత్తనం చేస్తున్నారు
- ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'ఇసుకాసురుడు' కథనంపై కాకినాడ కలెక్టర్ ఆరా
- స్టాకు యార్డులకు ఇసుక రాకుండా అడ్డుకునే ప్రయత్నాలపై ఆగ్రహం
- ఎప్పటికప్పుడు స్టాకు యార్డులకు వస్తోన్న ఇసుకపై పర్యవేక్షణ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)
కాకినాడ జిల్లా ఇసుక అవసరాలు తీర్చడానికి కేటాయించిన ర్యాంపుల్లో వైసీపీ నేత ద్వారంపూడి అనుచరుడి పెత్తనంపై జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆరా తీశారు. కోనసీమ జిల్లాలోని పొడగట్లపల్లి, తూర్పుగోదావరిజిల్లాలో కాటవరం ర్యాంపులు అధికారికంగా కాంట్రాక్టు కంపెనీలకు కేటాయిస్తే వీటిలో వేరొకరు పాగా వేసి ఇసుక అక్రమాలు చేస్తుండడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అసలు తెరవెనుక దందా చేస్తోన్న నేత గురించి ఆరా తీశారు. రీచ్‌లు దక్కించుకున్న కంపెనీలకు, సదరు చీకటి నేతకు సంబంధాలేంటనేదానిపై కలెక్టరేట్ అధికారుల ద్వారా లోతుగా గుట్టు సేకరించారు. రీచ్‌లపై అనధికార వ్యక్తుల పెత్తనం సహించేదిలేదని అధికారులవద్ద ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోపక్క గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రధాన అనుచరుడైన ఓ హోటల్‌ను ఇంటి పేరుగా మార్చుకున్న వైసీపీ నేత చెలరేగిపోయాడు. ఎక్కడికక్కడ ఉమ్మడి జిల్లాలో గ్రావెల్ అక్రమాలకు తెగబడ్డాడు. ఇప్పుడు ప్రభుత్వం మారినా అదే నేత ఇంకా దందాలు చేయడంపై 'ఆంధ్రజ్యోతి'లో గురువారం 'ఇసుకాసురుడు' అనే శీర్షికతో కథనం వెలువడింది. దీనిపై కాకినాడ కలెక్టర్ ఆరాతీశారు. జిల్లాలో ఇసుక స్టాకుయార్డులకు రీచ్‌ల నుంచి ఇసుక ఇవ్వకుండా ద్వారంపూడి అనుచరుడు బెదిరింపులకు దిగుతున్న వ్యక్తి ఎవరనేదానిపై ఆరా తీశారు. అసలు రీచ్‌ల్లో ఏం జరుగుతుందో వివరాలు రప్పించుకున్నారు. రీచ్‌ల్లో అనధికార వ్యక్తుల పెత్తనం చేస్తే కాంట్రాక్టు రద్దు చేయడానికి కూడా వెనుకాడేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. అసలే వచ్చేది వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలో ప్రజలకు ఇసుక ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి స్టాకుయార్డులోను ఇసుక తగినంత ఉండేలా కలెక్టర్ స్వయంగా పర్యవేక్షణ మొదలుపెట్టారు. ప్రస్తుతం జిల్లాలో పెద్దాపురం,పిఠాపురం, కాకినాడ, కాకినాడలో ఉప్పలంక, కాకినాడ అర్బన్, ప్రత్తిపాడు స్టాకుయార్డుల్లో ఈనెల 27నాటికి 1,37,791మెట్రిక్ టన్నులు ఉందని అధికారులు వివరించారు. ఇదిరోజురోజుకు మారుతుందని తెలిపారు. మరోపక్క తమకు దక్కిన రీచ్‌ల వెనుక వైసీపీ నేత పెత్తనం కొనసాగుతుందన్న విషయం బయటకు పొక్కడంతో సదరు నిర్వాహకులు ఆంధ్రజ్యోతి కథనం ఉలిక్కిపడ్డారు. ఏ స్టాకు యార్డు నుంచి నిజాలు బయటకు పొక్కాయి అనేదానిపై ఆరా తీయడం మొదలుపెట్టారు.

పోలీస్‌స్టేషన్ వద్ద గాయాలతో వ్యక్తి హల్‌చల్ 7

రేపే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

- జూన్ 1 ఆదివారం కావడంతో ఒకరోజు ముందే సిద్ధం
- జిల్లాలో రూ.101.73కోట్లు
- 12న స్పౌజ్ పింఛన్లు

రాజమహేంద్రవరం, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పింఛనుదార్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జూన్ 1న ఆదివారం కావడంతో ఆ రోజు పంపిణీ చేయాల్సిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ఒకరోజు ముందే అంటే శనివారం రోజునే పంపిణీకి ఏర్పాట్లు చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. కలెక్టర్ ప్రశాంతి ఇప్పటికే ఏర్పాట్లు చేయించారు. జిల్లాలో మొత్తం 2,32,916మందికి రూ.101కోట్ల73లక్షల77వేల500 పంపిణీ చేయాల్సి ఉంది. ఈసొమ్మును బ్యాంక్‌ల నుంచి శుక్రవారమే డ్రా చేసేలా ఆదేశాలిచ్చారు. ఈనెల 31న శనివారం ఉదయంనుంచే పింఛన్ల పంపిణీ చేయడానికి సచివాలయ, ఇతర ఉద్యోగ సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. కొత్తగా స్పౌజ్ పింఛన్ల కింద భర్త చనిపోతే భార్యకు ఇచ్చే పింఛన్లను జూన్ 12న పంపిణీ చేయడానికి నిర్ణయించారు. వాటికి సంబంధించి న డబ్బును 11వతేదీనే బ్యాంక్‌ల నుంచి విత్‌డ్రా చేయనున్నారు. ఇక జిల్లాలో మండలాల వారీ పంపిణీ వివరాలివి. అనపర్తిలో రూ.43.2లక్షలు బిక్కవోలులో రూ.44.3లక్షలు, చాగల్లులో రూ.96.9లక్షలు, దేవరపల్లిలో రూ.46.6లక్షలు గోకవరంలో రూ.45.5లక్షలు, గోపాలపురంలో రూ.38.4లక్షలు, కడియంలో రూ.50.9లక్షలు, కోరుకొండలో రూ.54.1లక్షలు, కొవ్వూరులో రూ.43.2లక్షలు, కొవ్వూరు అర్బన్‌లో రూ.13.9లక్షలు, నల్లజరలో రూ.48.9లక్షలు, నిడదవోలులో రూ.44.9లక్షలు, నిడదవోలు అర్బన్‌లో రూ.18.7లక్షలు, పెరవలిలో రూ.43.6లక్షలు, రాజమండ్రిఅర్బన్‌లో రూ.12.34 లక్షలు, రూరల్‌లో రూ.86.7లక్షలు రాజానగరంలో రూ.65.83లక్షలు, రంగంపేటలో 8701మందికిరూ.37.76లక్షలు, సీతానగరంలోరూ.48.6లక్షలు, ఉండ్రాజవరంలో రూ.45.1లక్షలు ఇవ్వనున్నారు.

సైనిక్ సంక్షేమ నిధికి రూ.6.37లక్షల విరాళాలు అందజేత



సైనిక్ వెల్ఫేర్ అధికారికి చెక్‌ను అందిస్తున్న కలెక్టర్, ఎస్పీ

రాజమహేంద్రవరం సిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సైనిక్ సంక్షేమ నిధికి వచ్చిన విరాళాలు రూ.6లక్షల37వేల790లను కలెక్టర్ ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ జిల్లా సైనిక్ సంక్షేమ అధికారికి అందజేశారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పీడీ డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల గ్రూపులు అందించిన నగదును గురువారం వారు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ దేశ రక్షణ కోసం పోరాడిన సైనికులకోసం సైనిక్ వెల్ఫేర్ ఫండ్ ప్రతిఒక్కరూ తమ వంతుగా స్వచ్ఛందంగా అందించి సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. స్వయం సహాయక సంఘాలు సైనిక్ వెల్ఫేర్ ఫండ్‌కు విరాళాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఎస్పీ నరసింహకిషోర్ మాట్లాడుతూ సైనిక్ సంక్షేమనిధి మాజీ సైనికులు, యుద్ధ వితంతువులు, దివ్యాంగులైన మాజీ సైనికులు, రక్షణ సిబ్బంది కుటుంబాల సంక్షేమ, పునరావాసం కోసం ఏర్పాటు చేశారన్నారు. ఈ నిధి ద్వారా వారి కోసం వివిధ సంక్షేమ పథకాలు, సహాయక కార్యక్రమాలు అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీఎస్ మూర్తి, సైనిక్ సంక్షేమ అధికారి సహాయ సంచాలకులు డాక్టర్ సత్యకుమార్, డీపీఎం బి.హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

ఇసుక జిల్లా కమిటీ మీటింగ్‌లో ఏపీఎస్ఏసీ నివేదికపై చర్చ

రికార్డులు పరిశీలించాలని కలెక్టర్ ఆదేశం



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

రాజమహేంద్రవరం, మే 29(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021, మే నుంచి 2024, మే వరకూ జిల్లాలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణ మొదలైంది. అప్పటి అక్రమ తవ్వకాల గురించి ఏపీఎస్ఏసీ, ఐటీ అండ్‌సీ విభాగం వైస్‌ఛైర్మన్ గూగుల్ ఎర్త్‌ప్రో డేటా ద్వారా హైరిజల్యూషన్ ఉపగ్రహ చిత్రాన్ని ఉపయోగించి నదులు, ఇసుక రీచ్‌ల్లో అక్రమ ఇసుక తవ్వకాల గురించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా ఇసుక కమిటీలో ఈ నివేదిక మీద చర్చించి ఆయాప్రాంతాల్లో తవ్వకాల మీద చర్యలు తీసుకోవాలని గనులశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ కోరడంతో కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన గురువారం జరిగిన జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో ఉపగ్రహ చిత్రాలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఆయా అంశాల మీద శాఖాపరంగా రికార్డులన్నీ పరిశీలించి వివరాలు ఇవ్వాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. త్వరలో ఈ అక్రమ తవ్వకాల బాగోతం బయటపడనుంది.అంతకుముందు జిల్లాలో ఇసుక పరిస్థితిని సమీక్షించారు. 15 ఓపెన్ రీచ్‌లు, 18 డీసిల్టేషన్ పాయింట్లు, 13, డీసిల్టేషన్ సరఫరా పాయింట్లు ఉన్నట్టు తెలిపారు. వర్షాకాలంలో ఇసుక ఇబ్బంది లేకుండా స్టాక్ పాయింట్లలో జిల్లా ఇసుక కమిటీ ఛైర్మన్ నిర్ణయించిన ధరకే విక్రయించాలని స్పష్టం చేశారు. నిర్ణయించిన ధరల బోర్డులు పెట్టాలని, స్టాక్ పాయింట్లవద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ ఎస్.చిన్నరాముడు, ఎస్పీ డి.నరసింహకిశోర్, మైన్స్ ఏడీ ఫణీంద్రరెడ్డి పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల నిల్వకు గోదాము కావాలి: డీఈవో

రాజమహేంద్రవరం సిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే 50లక్షల పాఠ్యపుస్తకాలను నిల్వచేసేందుకు అనువైన గోదాము కావాలని డీఈవో కె.వాసుదేవరావు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 10నుంచి 15వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల గోదాము అవసరమని తెలిపారు. అనువైన భవనం కలిగిన యజమానులు ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విక్రయశాల మేనేజరు ఫోన్ నెంబరు 6301222549 నెంబరును కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలని కోరారు.

2న డీసెట్ -2025 పరీక్ష

రాజమహేంద్రవరం సిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డైట్ కళాశాల ఫస్ట్ ఇయర్ ప్రవేశానికి నిర్వహిస్తున్న డీసెట్-2025 పరీక్ష వచ్చే నెల 2న రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాల డిజిటల్ జోన్ ఐడిజెడ్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు సంబంధించి ఎటువంటి అనుమానాలున్నా హెల్ప్‌లైన్ 9849894917, 7287089697 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

అర్జీల పరిష్కార స్థాయి తెలుసుకోవడానికి 1100కు డయల్ చేయండి: కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్ ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం కలెక్టరేట్‌తోపాటు డివిజన్, మండల స్థాయిల్లో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌లో ప్రజల అర్జీల పరిష్కార స్థాయిని తెలుసుకోవడానికి 1100కు డయల్ చేయవచ్చని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌పై ప్రజాసమస్యల పరిష్కార స్థాయిపై వివిధ మండలాలనుంచి వచ్చిన అర్జీదారులతో అధికారులతో కలెక్టర్ వ్యక్తిగతంగా సమావేశమయ్యారు.







సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు

మహా జాతర





కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం



కొమరగిరి పెద్ద చెరువులో చేపలు పడుతున్న దృశ్యం (పాత చిత్రం)



వింటే భారతం వినాలి... తింటే గారెలే తినాలి అనే సామెత పాతదైనా ఆ గ్రామానికి చెందిన చెరువు చేపను సంవత్సరానికి ఒకసారైనా తినాలనే కోరికతో కొత్తపల్లి మండల ప్రజలు ఉవ్విళ్లూరుతుంటారు. దాంతో చేపలు పట్టే రోజుకి చేతుల్లో డబ్బులు లేకపోయినప్పటికీ అప్పోసొప్పో చేసి లేక ఏదైనా వస్తువు తాకట్టుపెట్టి మరీ చేపలు కొనుగోలు చేయడం విశేషం.


సంధువాలు

రుచి అమోఘం

- కొమరగిరి పెద్ద చెరువు చేపలకు డిమాండ్
- వస్తువులను తాకట్టు పెట్టయినా సరే కొనాల్సిందే
- సంవత్సరానికి ఒకసారే పట్టుబడి


6 కిలోల బరువున్న వాలుగు చేప

కొత్తపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలోని కొమరగిరిలో సుమారు 250 ఎకరాల విస్తీర్ణం కలిగిన పెద్ద చెరువు ఉంది. ఇందులో సంవత్సరానికి ఒకసారే చేపలు పట్టుబడి పడతారు. పంచాయతీకి చెందిన ఈ చెరువును స్థానికంగా మకాం ఉండే పల్లీలు లీజుకు తీసుకుని చేపలు పండిస్తారు. ప్రతి సంవత్సరం జూన్ నెల దాటాక చెరువు చేపల్లో మంచినైన రాగండి, బొచ్చు, గడ్డి, చెరువు సంధువాలు, ఎర్రమైల, వాలుగు తదితర రకాలకు చెందిన చేపల పిల్లలను వేస్తారు. మరలా మే నెల వచ్చే వరకు ఆ చెరువు వద్దకు పల్లీలు వెళ్లరు. అంతేగాక చేప పిల్లలకు ఎటువంటి ఆహారం వేయరు. చెరువులో ఉండే గడ్డి, నాచు, తూటికాడ, పొన్నగంటి కూరలను ఆహారంగా తింటాయి. సుమారు సంవత్సరం పాటు పెరిగిన చేపలు ఒక్కొక్కటి ఐదు నుంచి 8 కిలోల బరువు పెరుగుతాయి. వాటిని వారంలో రెండు లేక మూడు రోజులు పట్టుబడి పడతారు. కిలో రూ.130 చొప్పున తొలుత గ్రామ ప్రజలకు టోకెన్ల ద్వారా అమ్ముతారు. వారు వాటిని కొనుగోలు చేసి పొరుగూళ్లలో వున్న బంధువులు, స్నేహితులు, రాజకీయ ప్రముఖులకు పంపిస్తారు. ఆ తర్వాత వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు కిలో రూ.150 చొప్పున విక్రయిస్తారు. ఎటువంటి మేత (ఆహారం) వేయకుండా కేవలం గడ్డి, తూటికాడ, పొన్నగంటి కూరలను మేతగా తిన్న చేపల రుచి అమోఘంగా ఉంటుందని ఇక్కడి ప్రజలు చెప్తున్నారు. ఈ చేపలను వేపుడు లేదా పులుసు చేసుకుని మాంసాహారప్రియులు లొట్టలేసుకుని తింటారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారు కొమరగిరి చెరువులో చేపలు ఎప్పుడు పడతారా అని బంధువులను ఆరా తీయడం గమనార్హం.


కొమరగిరి చెరువు వద్ద చేపల కొనుగోలుకు గుమిగూడిన ప్రజలు (పాత చిత్రం)


ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరైన ప్రధానోపాధ్యాయులు

ఉపాధ్యాయుల బదిలీలకు ముగిసిన దరఖాస్తు ప్రక్రియ

కాకినాడ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలకు దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ కేడర్లలో 8,839 మంది వివరాలు నమోదు చేసుకున్నారు. వారిలో 4,352 మంది ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన వారున్నారు. 4,487 మంది రిక్వెస్ట్ పెట్టుకున్నారు. హెచ్ఎంలకు సంబంధించి సీనియారిటీ జాబితా, అభ్యంతరాల స్వీకరణ ఇప్పటికే పూర్తయ్యింది. బుధవారం వెబ్ ఆప్షన్లు కూడా తొలగించడంతో వారంతా తదుపరి ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీల సీనియారిటీ జాబితాను సిద్ధం చేసే పనిలో విద్యా శాఖ నిమగ్నమైంది. శుక్రవారం నాటికి కొలిక్కివచ్చే అవకాశముంది. జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి తుది జాబితాను ప్రచురిస్తారు. అనంతరం వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలి. ఉద్యోగోన్నతులకు 252 మంది స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న 111మంది హెచ్ఎంలకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించినట్టు కాకినాడ జిల్లా డీఈవో రమేష్ తెలిపారు.

కేటగిరీ	తప్పనిసరి బదిలీ	రిక్వస్ట్	మొత్తం
ప్రధానోపాధ్యాయులు	66	179	245
స్కూల్ అసిస్టెంట్లు	2217	2368	4585
ఎస్జీటీలు	2069	1940	4009

సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టరేట్, జేఎన్టీయూకే మధ్య ఎంవోయూ


అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న జేఎన్టీయూకే వీసీ, సీసీఎండీఆర్‌సీ ప్రతినిధులు

జేఎన్టీయూకే, మే 29 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టరేట్, జేఎన్టీయూకే మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్టు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్ర నాథ్ తెలిపారు. గురువారం జరిగిన కార్యక్రమంలో వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ హెచ్ భారతి హొల్లికేరి ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. వీసీ మాట్లాడుతూ ఈ ఎంవోయూ ద్వారా వర్సిటీలోని ఐఆర్‌సీలో సెంటర్ ఫర్ సెన్సస్ మైక్రోడేటా పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించామని, దీనికి యూసీఈకే వైస్ ప్రిన్సిపాల్ జీవీఎస్ఆర్ దీక్షితులు నోడల్ అధికారిగా నియమితులయ్యారన్నారు. భారతి హల్లికేరి మాట్లాడుతూ జనగణనను ఇప్పటివరకు 15సార్లు చేపట్టామన్నారు. కొవిడ్ కారణంగా 16వ జనగణన చేపట్టలేదని, ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ హోమ్ అఫైర్స్ డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ శశికుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ కె.సుప్రెజ్, రెక్టార్ కేవీ రమణ, ఓఎస్డీ కోటేశ్వరరావు, డైరెక్టర్లు బాలకృష్ణ, కృష్ణప్రసాద్, పద్మజారాణి, గోపాలకృష్ణ, మాజీ వీసీలు శ్రీనివాస్‌కుమార్, పద్మరాజు పాల్గొన్నారు.


మహీరమ రాసిన నవలను ఆవిష్కరిస్తున్న ఉప కులపతి ప్రసన్నశ్రీ

మహీరమ కలం నుంచి ఆంగ్ల ఫిక్షన్ నవల

ఆవిష్కరించిన నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మే 29 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన చల్లా మహీరమ ఆసక్తికర కథనంతో ఆంగ్ల ఫిక్షన్ నవల రాసి రికార్డు సృష్టించిందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. 13 ఏళ్ల మహీరమ రాసిన 'రూబీస్ బ్లూ స్ట్రీమ్ అండ్ ది బాండ్ ఆఫ్ ఫైర్' నవలను గురువారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసన్నశ్రీ మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ వైద్యుడు చల్లా వెంకట సుబ్బరాయశాస్త్రి మనుమరాలైన మహీరమ ప్రకృతి, పంచభూతాల కథాంశంగా ఫిక్షన్ నవల రాసిందన్నారు. ఆరవ ఏట వరకు అమెరికాలో పెరిగిన మహీరమ తండ్రి రోషన్‌కృష్ణ ఉద్యోగరీత్యా ప్రస్తుతం హైదరాబాద్‌లో 9వ తరగతి చదువుతోందని తెలిపారు. రచయిత్రి మహీరమ మాట్లాడుతూ... ప్రకృతితో మానవుడి అనుబంధం, ప్రకృతికి విరుద్ధంగా ప్రవర్తిస్తే కలిగే పర్యవసానాలు, జీవితగమ్యాన్ని ఈ రచన ద్వారా చెప్పానన్నారు. తనను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, తాత, మామ్మలకు, గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహీరమ తల్లి సాయిసుధ, అమ్మమ్మ, తాతయ్య గోపాలమ్మ, ఏవీఎస్ రాజు, స్పృహ అలూమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు సుంకర నాగేంద్రకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కొంచెమే పెంపు

ధాన్యానికి కనీస మద్దతు ధర పెంచిన కేంద్రం



- క్వింటాలుకు రూ.69 పెంపు
- గ్రేడ్ ఏ రకం రూ.2,369
- సాధారణ రకం రూ.2,252
- ఈ ఖరీఫ్ సీజన్ నుంచి కొనుగోలుకు పౌరసరఫరాల శాఖ సిద్ధం
- ఉమ్మడి జిల్లాలో 14.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా
- పెదవి విరుస్తున్న రైతులు

సామర్లకోట, మే 29 (ఆంధ్రజ్యోతి): మే నెలలో ధాన్యానికి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పెరిగింది. క్వింటాలుకు రూ.69 పెరిగింది. గతేడాది గ్రేడ్ ఏ రకం ధాన్యానికి రూ.2,320గా కేంద్రం ప్రకటించగా ఈ ఏడాది మరో రూ.69 పెంచడంతో రూ.2,369కి చేరింది. సాధారణ రకం ధాన్యం రూ.2,183 ఉండగా ఈ ఏడాది రూ.69 ప్రక టించడంతో రూ.2,252కి చేరింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆదే శాలతో సీఏసీపీ ప్రత్యేక సమావేశం నిర్వహించి బుధవారం సాయంత్రం కనీస మద్దతు ధరలను ప్రకటించింది. తాజా మద్దతు ధరతో రానున్న 2025-26 ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు చేసేందుకు వీలుగా పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేయాల్సిఉంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 5.54 లక్షల ఎకరాల పరిధిలో 14.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల ప్రభావం లేకపోతే ఎకరాకు వరికి 4.5 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది. కేంద్ర ప్రభుత్వం వరికి మద్దతు ధర క్వింటాలుకు రూ.69 పెంచడంతో ఉమ్మడి జిల్లాలో రైతులకు రూ.180కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

సాగు ఖర్చులతో పోలిస్తే...

వరి మొక్కజొన్న తదితర 16 పంటలకు సంబంధించి మద్దతు ధరలను పెంచుతూ వ్యవసాయ, వ్యయ ధరల కమిషన్ (సీఏసీపీ) కేంద్రప్రభుత్వానికి సిఫార్సు చేసింది. పెసలు కనీస మద్దతు ధరను 10.4 శాతం మేర పెంచి రూ.8,768గా నిర్ణయించింది. గతేడాది పెసలు క్వింటాలుకు రూ.8,682గా ఉంది. పెసలపై 8 శాతం పెంచగా, వరికి కేవలం 6 శాతం మాత్రమే పెంచింది. ఈ పెంపుదల ధరలు వరికే అత్యధికం అని కేంద్రప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ పెరి గిన సాగుఖర్చులుతో పోలిస్తే ఇది ఏమంత అధికం కాదని రైతులు చెప్తున్నారు. ఈ సిఫార్సులను కేంద్ర మంత్రివర్గ ఆమోదంతో సాధారణ రకం, గ్రేడ్ ఏ రకాలకు ప్రస్తుతం చెల్లిస్తున్న ధర కంటే రూ.69 చొప్పున పెంచడానికి సన్నాహాలు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 330 ధాన్యం కొనుగోలు కేంద్రాల వరకూ ఏర్పాటు చేసి ప్రభుత్వం గతంలో ప్రకటించిన మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. గత ఖరీఫ్‌లో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనాలకు అనుగుణంగా కొనుగోలు చేపట్టలేకపోగా రానున్న ఖరీఫ్ నాటికి 5.54 లక్షల ఎకరాల్లో సాగు ద్వారా వచ్చే 16.00 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేయనున్నది. ఇక ధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.69 మాత్రమే పెంపుదల చేయడంతో రైతాంగం పెదవి విరు స్తుంది. సాగుకు పెట్టుబడులు అధికమవుతున్న తరుణంలో అందుకు తగ్గట్టుగా మద్దతు ధర లభించడం లేదని రైతులు, రైతు సంఘాల ప్రతి నిధులు పెదవి విరుస్తున్నారు. వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం అయినా చేయకుండా వ్యవసాయాన్ని నిర్వీర్యం చేస్తుందని పాలక ప్రభుత్వాలపై అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిగిలిన పంటలకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలు

మొక్కజొన్న క్వింటాకు రూ.175
కందులు క్వింటాకు రూ.450
మినుములు క్వింటాకు రూ.400
వేరుశెనగ క్వింటాకు రూ.480
పత్తి క్వింటాకు రూ.589

చేతి చమురు వదిలించుకోవాల్సిందే...

ఉమ్మడి జిల్లాలో ప్రధానమైన వరిపంటకు కేంద్రం మద్దతు ధర ప్రకటించినా, ఏటా మిల్లర్లు రైతులకు మద్దతు ధర అందివ్వని పరిస్థితి నెలకొంది. రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లర్లకు ధాన్యాన్ని అందజేస్తున్నా, తమకు మాత్రం మద్దతు కరువవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభిప్రాయం ఎకరాకు సగటున 48 బస్తాల వరకూ దిగుబడులు వస్తాయని వ్యవ సాయ శాఖ అంచనా వేయగా క్వింటాలుకు కేం ద్రం ప్రకటించిన మద్దతు ధర గ్రేడ్ ఏ రకానికి 2,389 ప్రకారం బస్తాకు రూ.1,791.75 వస్తుంది. మొత్తం 48బస్తాలకు రూ.86,004 వస్తుంది. కానీ ఎకరానికి పెట్టుబడిగా రూ.70వేల వరకూ పెట్టుబడి వ్యయం అవుతుండగా, రైతుకు మిగి లేది కేవలం 16,004 మాత్రమే. అదే రైతు కూలీ పనులకు వెళితే పంట సాగుకాలంలో రూ.80 వేల వరకూ వచ్చే అవకాశాలు ఉన్నాయి. అది కూడా ఏ-గ్రేడ్ రకానికి మాత్రమే సొంతభూమి సాగు చేసుకునే రైతుకు కొంత మిగులు కనిపి ంచే అవకాశం ఉండగా కౌలు రైతు, ప్రభుత్వం ముద్దుగా పిలుచుకొనే సాగుహక్కుదారుడు చేతి చమురు వదిలించుకోవాల్సిందే. సాధారణంగా ఖరీఫ్‌లో సాగు హక్కుదారులకు ఏమీ మిగలదు. రబీలో లాభం ఉంటుందనే ఆశతోనే సాగులోకి దిగుతారు. అన్ని అవరోధాలను దాటుకుని సాగు చేసినా చేతికి మిగిలేది రెండు పదులు కూడా దాటని పరిస్థితి. అయితే మద్దతు ధర గణనీయంగా పెరిగితేనే రైతులకు ఎంతోకొంత మిగులుతుంది.



ఎట్టకేలకు.. హెచ్చరిక బోర్డు



అన్నవరంలో పంపా తీరం వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

అన్నవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం వద్ద పంపా కొలనులో దిగి యువకుడు మృతిచెందిన సంఘటన విధితమే. అయితే స్వామివారి కల్యాణోత్సవ చక్రస్నానం కోసం ఏర్పాటుచేసిన కొలను ఈ ప్రమాదానికి కారణమైంది. దీంతో కార్యక్రమం ఈనెల 12తో ముగిసినా కొలను వద్ద హెచ్చరిక బోర్డు లేకపోవడంతో నిండుప్రాణం బలైంది. దీంతో అధికారులు గురువారం పంపా తీరం వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

ఆరడుగుల.. గోధుమ తాచుపాము హల్‌చల్

అంబాజీపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట విజ్జపు వెంకటరాజు ఆయిల్ మిల్లులో ఆరడుగుల గోధుమ రంగు తాచుపాము గురువారం భయభ్రాంతులను గురిచేసింది. దీంతో వెంకట్రాజు స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించడంతో అతడు అక్కడకు చేరుకుని రేకుల కింద ఉన్న తాచుపామును చాకచక్యంగా పట్టుకున్నాడు. ఆ పాము దూరప్రాంతంలో విడిచిపెడతానని వర్మ తెలిపాడు.



అంబాజీపేటలో తాచుపామును పట్టుకున్న వర్మ

అన్నవరం దేవస్థానం

ఏఈవోపై సీఎంవోకు ఫిర్యాదు

- శ్రీపుష్పయోగం రోజున భక్తురాలిపై అసభ్యంగా ప్రవర్తించాడని ఫిర్యాదు
- ఆలయ విభాగ బాధ్యతల నుంచి తప్పించి విచారణాధికారిని నియమించిన ఈవో

అన్నవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఆలయ విభాగ ఏఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న కొండలరావుపై ఒక భక్తుడు సీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు చేయడంతో ఈ విషయం రత్నగిరిపై చర్చనీయాంశమైంది. సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాల ముగింపు శ్రీపుష్పయోగం రోజున ఏఈవో కొండరావు ఒక మహిళపై దురుసుగా ప్రవర్తించడంతో పాటుగా తాకరాని ప్రదేశంలో చెయ్యిపెట్టి తోసేశారని ఫిర్యాదు చేయడంతో సీఎంవో కార్యాలయం విషయాన్ని సీరియస్‌గా తీసుకుని విచారణకు ఆదేశించింది. దీంతో ఈవో వీర్ల సుబ్బారావు అతనిని ఆలయ విభాగ బాధ్యతల నుంచి తప్పించి విచారణాధికారిగా దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌ను నియమించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇటీవల దేవస్థానంలో సేవ చేసేందుకు విచ్చేసిన సేవకులపై కూడా ఏఈవో దురుసుగా మాట్లాడడంతో దేవదాయ కమిషనర్ విచారణకు ఆదేశించిన సంగతి విధితమే. మరో నెలరోజుల్లో పదవీ విరమణ చేయనున్న ఆయన ఈ విధంగా ప్రవర్తించడం, వివాదాలకు కారణమవుతుండడంతో ఆలయఉద్యోగులు దీనిపై చర్చించుకుంటున్నారు.

ప్రేమ పేరుతో బాలికపై అత్యాచారం

గర్భవతిని చేసి పరారైన యువకుడిపై పోక్సో కేసు నమోదు

కె.గంగవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలంలోని ఓ గ్రామంలో బాలికను అదే గ్రామానికి చెందిన మండపల్లి సాగర్ అనే యువకుడు ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి అత్యాచారం చేశాడు. బాలిక ప్రస్తుతం 7 నెలల గర్భవతి. దీనిపై పామర్రు పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. డీఎస్పీ రఘువీర్, అమలాపురం మహిళా ఎస్‌ఐ గంగాభవానిలు బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. మండపల్లి సాగర్ తను నివాసం ఉంటున్న కాలనీలోని ఓ మైనర్‌ను ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. అప్పటి నుంచి పెళ్లి చేసుకోమని అడుగుతుంటే కుదరదని చెబుతూ ఉన్నాడు. బాలిక కుటుంబీకులు స్థానిక పెద్దలను ఆశ్రయించారు. అక్కడ వారికి న్యాయం జరగకపోవడంతో పామర్రు పోలీసులను ఆశ్రయించారు. గురువారం సాయంత్రం రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, పామర్రు ఎస్ఐ. ఎస్‌కె జానీ బాషా, అమలాపురం మహిళా ఎస్ఐ గంగా భవానీలు బాధితురాలి ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేశారు. అయితే సాగర్ పరారీలో ఉన్నాడని పోలీసులు వెల్లడించారు.

పోలీస్‌స్టేషన్ వద్ద

రక్తపు గాయాలతో వ్యక్తి హల్‌చల్

జగ్గంపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట పోలీస్‌స్టేషన్ వద్ద ఖమ్మం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి బుధవారం సాయంత్రం రక్తపు గాయాలతో హల్‌చల్ చేశాడు. వివరాల ప్రకారం.. లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న వ్యక్తి జగ్గంపేటలో బాలాజీ రైస్‌మిల్లులో అన్‌లోడ్ చేసుకుని రోడ్డుపై వెళ్తున్నవారితో అసభ్యంగా ప్రవరిస్తున్నాడని స్టేషన్‌లో అందిన సమాచారం ప్రకారం సిబ్బంది అతడి వద్ద ఫోన్‌ను తీసుకొచ్చారు. దీంతో ఆ వ్యక్తి స్టేషన్ వద్దకు వచ్చి పోలీసులు దౌర్జన్యం నశించాలంటూ గాజు పెంకుతో ఒంటిపై కోసుకుని రక్తపు గాయాలతో ఉండగా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. అయితే తను వద్ద నుంచి ఫోన్, రూ.50వేలు నగదు పోలీసులు తీసుకున్నారని సదరు వ్యక్తి వాపోతున్నాడు.



పోలీస్‌స్టేషన్ వద్ద హల్‌చల్ చేస్తున్న వ్యక్తి

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. హంసవరం రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వద్ద ఏ ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. సంబంధికులెవరైనా ఉంటే రైల్వే పోలీసులను, రైల్వే ఫోన్ నెంబర్ 9490619020లో సంప్రదించాలని కోరారు.



హంసవరం వద్ద మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సీఎం పర్యటనకు శరవేగంతో పనులు

- ముమ్మిడివరం నియోజకవర్గంలో రేపు చంద్రబాబు పర్యటన
- సిద్ధమవుతున్న ప్రజా వేదిక

ముమ్మిడివరం, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు శరవేగంతో సాగుతున్నాయి. ఈ నెల 31న ముఖ్యమంత్రి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి జిల్లా యంత్రాంగమంతా అక్కడే ఉండి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మహిపాలచెరువు, పల్లంకుర్రు ఆర్అండ్‌బీ రోడ్డును సీహెచ్ గున్నేపల్లి నుంచి చెయ్యేరు వరకు రోడ్డుపక్కన ఉన్న చెత్త, పిచ్చిమొక్కలను తీసివేసి శుభ్రం చేస్తున్నారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండింగ్ అయ్యేందుకు సీహెచ్ గున్నేపల్లిలోని పాత ఓఎన్జీసీ సైట్‌లో ఉన్న కొబ్బరి పీచును తొలగించి హెలిప్యాడ్‌ను ఆధునికీకరిస్తున్నారు. అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. హెలిప్యాడ్ నుంచి ప్రజావేదికకు సీఎం కాన్వాయ్ వెళ్లేందుకు హెలిప్యాడ్ నుంచి మెయిన్‌రోడ్డుకు రోడ్డును ఆధునికీకరిస్తున్నారు. చెయ్యేరులో నిర్వహించే ప్రజా వేదికకు సంబంధించి వేదికను సిద్ధం చేస్తున్నారు. అక్కడ రోడ్లు కూడా ఆధునికీకరిస్తున్నారు. పేదల సేవలో భాగంగా ముగ్గురు పేదలను దత్తత తీసుకునే కార్యక్రమానికి సంబంధించి ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. ప్రజావేదికలో గ్రామస్తులతో మాట్లాడిన తరువాత ఉపాధిహామీ పథకంలో చెయ్యేరు ఆధునికీకరిస్తున్న చెరువును పరిశీలించి అక్కడ ఉపాధిహామీ కూలీలతో సీఎం మమేకమవుతారు. అక్కడ ఎంపికన చేసిన నలుగురి పెన్షనర్లతో మాట్లాడనున్నారు. మెయిన్ రోడ్డు నుంచి చెరువు వరకు రోడ్డును ఆధునికీకరించి అక్కడ భారీకేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మతల్లి ఆలయ సమీపంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడేందుకు వేదికను ఏర్పాటు చేస్తున్నారు.



చెయ్యేరులో ప్రజా వేదికను సిద్ధం చేస్తున్న దృశ్యం



సీహెచ్ గున్నేపల్లిలో హెలిప్యాడ్‌ను సిద్ధం చేస్తున్న దృశ్యం

భారీ బందోబస్తు..

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు సంబంధించి భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలీసు బలగాలు బస చేసేందుకు ముమ్మిడివరంలోని కల్యాణ మండపాలను సిద్ధం చేశారు. పోలీసు బలగాలంతా ముందురోజే ఇక్కడకు చేరుకోనున్నాయి. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, ఎనిమిది మంది డీఎస్పీలు, 27 మంది సీఐలు, రిజర్వుడు ఇనస్పెక్టర్లు ముగ్గురు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు 64 మంది, ఏఎస్‌లు, హెచ్‌సీలు, పోలీసు కానిస్టేబుళ్లు 492 మంది, మహిళా పోలీసులు 67 మంది, హోంగార్డులు 88 మంది మొత్తం 751 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. వీరు కాక ఆర్మ్డ్ రిజర్వ్ పార్టీ 35 మంది, ఎనిమిది స్పెషల్ పార్టీలను ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సీఎం పర్యటనకు సంబంధించి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

రంగా విగ్రహాలు.. రగిలిన ఆందోళనలు!

- అంతర్వేదిలో రంగా విగ్రహం తొలగింపుపై వివాదం, ఉద్రిక్తత
- రోడ్డుపై బైఠాయించిన నాయకులు
- కొత్తపల్లిలో రంగా విగ్రహం చేతులు విరగొట్టిన వైనం



ధర్నా చేస్తున్న నాయకులు, మహిళలు, గ్రామస్తులు



అంతర్వేది కొత్తపేటలో ఏర్పాటు చేసిన రంగా విగ్రహం

అంతర్వేది, మే 29(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో గురువారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కొత్తపేట సెంటర్‌లో బుధవారం అర్ధరాత్రి వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఒక వర్గంవారు రాత్రికి రాత్రే ఏర్పాటు చేశారు. మరొక వర్గంవారు విగ్రహ ఏర్పాటును వ్యతిరేకించి పోలీసులకు తెలియచేయడంతో పోలీసులు తెల్లవారుజామున విగ్రహాన్ని తొలగించారు. దీంతో ఆగ్రహించిన కాపు సంఘాల నాయకులు, గ్రామస్తులు విగ్రహాన్ని తొలగించిన ప్రదేశంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేస్తూ ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. ఈ తరుణంలో పోలీసులు, రంగా అభిమానులకు మధ్య తోపులాట జరిగింది. రాజోలు నియోజకవర్గ నాయకులు, కాపు సంఘాల నాయకులు, మహిళలు రోడ్డుపై బైఠాయించి రంగా విగ్రహాన్ని యథాస్థానంలో ఏర్పాటుచేయాలని నినాదాలు చేశారు. పోలీసులతో వాగ్వాదం చేస్తూ రంగా విగ్రహాన్ని తీసిన చోటే గ్రామస్తులు పెట్టారు. ఈ తోపులాటలో రంగా విగ్రహం చేయి విరిగింది. అనంతరం విగ్రహానికి దండలు వేసి కాపు సంఘ నాయకులు, మహిళలు ధర్నా చేశారు. ఉదయం 6 గంటల నుంచి ఇరువర్గాలతో చర్చలు జరుపగా అమలాపురం ఆర్డీవో మాధవి, డీఎస్పీ మురళీమోహన్ ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోసం ఎదురుచూడ సాగారు. మధ్యాహ్నానికి ఎమ్మెల్యే సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని పరిశీలించి ఇరువర్గాలతో చర్చలు జరిపారు. ఇరువర్గాల నుంచి చెరొక ఐదుగురు సభ్యులను స్థానిక పంచాయతీ భవనంలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేసి వారితో మాట్లాడి పరిస్థితులు చేజారిపోకుండా శాంతింపచేశారు. అన్నివర్గాల నాయకుల విగ్రహాలకు ఇబ్బంది లేకుండా విగ్రహం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. విగ్రహం ఎత్తు, దిమ్మ, నిర్మాణాలు సక్రమంగా అవతల వారి డిమాండ్ల మేరకు విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇచ్చి ఇరువర్గాలతో శాంతియుతంగా చర్చలు జరిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్, రాజోలు సీఐ నరేష్‌కుమార్, రాజోలు, సఖినేటిపల్లి, మలికిపురం ఎస్ఐలు పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకున్నారు. సీఐ నరేష్, తహశీల్దార్ వెంకటేశ్వరరావు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో ధర్నా

కొత్తపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి ఊరచెరువు సెంటర్లో కాపు నాయకుడు వంగవీటి మోహనరంగా విగ్రహం చేతులు విరగొట్టిన వారిపై చర్యలు చేపట్టాలని జనసేన, రంగా యూత్ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఇటీవల సెంటర్లో ఉన్న రంగా విగ్రహం చేతి వేళ్లను గుర్తు తెలియని వ్యక్తి విరగొట్టాడని, గురువారం తెల్లవారుజామున విగ్రహం చేతి మణికట్టు వద్ద విరగొట్టి పక్కనే ఉన్న చెరువులో విసిరేశారని జనసేన, రంగా యూత్ ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ విగ్రహాన్ని పరిశీలించి నిందితుడిని గుర్తించి చట్టపరమైన చర్యలు చేపడతామని హామీఇవ్వడంతో ఆందోళన విరమించారు. జనసేన నాయకులు కొణమర్తి రాంబాబు,ఆటో పెద్ద, భరత్, రాజారావు, మోకా పెద్దకాపు, బాబులు, మామిడాల రమణ, మోహన రంగాయూత్ సానా లోవరాజు, గంధం గంగ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న జనసేన, రంగా యూత్ సభ్యులు



కొత్తపల్లిలో రంగా విగ్రహం చేతులు విరగొట్టిన దృశ్యం

కొడవలిలో వివాహిత ఆత్మహత్య



మరణించిన నాగమణి

గొల్లప్రోలు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలిలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. కొడవలి ఎస్సీ కాలనీకి చెందిన నామా నాగమణి (44) కుటుంబసమస్యలతో ఇబ్బందిపడుతోంది. బుధవారం రాత్రి ఆమె ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త అనారోగ్య సమస్యలతో బాధపడుతుండటంతో ఆత్మహత్య చేసుకుందని చెప్తున్నారు. అయితే నాగమణి మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని సామర్లకోట మండలం హుస్సేన్‌పురానికి చెందిన ఆమె సోదరి పుప్పాల సూర్యమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మహేష్ (ఫైల్)

గొల్లప్రోలు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఎ.విజయనగరంలో విద్యుత్ షాక్‌తో వ్యక్తి మరణించాడు. అడ్డతీగల మండలం జి.కొత్తూరు గ్రామానికి చెందిన బూడిద మహేష్ (33) గురువారం కరెంటు పనులు చేస్తున్నాడు. విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న సమయంలో హెచ్‌టీ లైన్లు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర ంగా గాయపడ్డాడు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. మహేష్ సోదరి మరియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ద్రాక్షారామ మే 29 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం శివారు చీమల దిబ్బలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాజులూరు మండలం కుయ్యేరుకు చెందిన శీలం కమల(43) మృతి చెందింది. ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. కుయ్యేరు గ్రామం నుంచి ద్రాక్షారామలో వేడుకకు ఆమె మరో వ్యక్తితో కలిసి మోటారుసైకిల్‌పై బయలుదేరారు. ఇరుకైన రహదారిలో వాహనం గోతిలో పడడంతో వెనుక కూర్చున్న కమల జారి రోడ్డుపై పడింది. అదే సమయంలో ద్రాక్షారామ నుంచి కుయ్యేరు వెళ్తున్న లారీ ఆమె పైనుంచి వెళ్లడంతో వెనుకచక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

వై.రామవరం, మే 29(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం పనసలపాలెం ప్రధాన రహదారిలో ఈనెల 25న ఆర్టీసీ బస్సు, మోటారు బైక్ ఢీకొని ఇద్దరు యువకులు గాయపడిన విషయం విధితమే. కాగా వీరిలో పనసలపాలెనికి చెందిన పల్లాల నాగిరెడ్డి(22) కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



మృతిచెందిన పల్లాల నాగిరెడ్డి


నేడు ఉపాధి శ్రామికుల శ్రమతో గుర్రపు డెక్క తొలగించడంతో శుభ్రంగా ఉన్న కాకినాడ కాలువ

ఉపాధి హామీ శ్రామికుల శ్రమతో

కాకినాడ కాలువ ప్రక్షాళన

● నాడు పూడుకుపోయిన...
● నేడు శుభ్రంగా తయారైన కాలువ


నాడు గుర్రపు డెక్కతో అనపర్తి వద్ద పూడుకుపోయిన కాకినాడ కాలువ

అనపర్తి, మే 29(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లగా సాగునీటి కాలువల ఆలనా పాలనా చూడకపోవడంతో గుర్రపు డెక్కతో పూడుకుపోయిన కాలువలు నేడు పరిశుభ్రంగా మారి సాగు నీరు సక్రమంగా అందించేందుకు కాలువలు శుభ్రమవుతున్నాయి. దీనికి ఉదాహరణగా కాకినాడ కాలువలో అనపర్తి వద్ద నాడు నేడు చిత్రాలు నిలుస్తున్నాయి. గత పది పదిహేనురోజులుగా అనపర్తి పరిధిలోని కాకినాడ కాలువలో రోజుకు 450మంది ఉపాధి శ్రామికులు శ్రమపడి కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను, విరిగిపడిన చెట్ల కొమ్మలను తొలగిస్తుండడంతో కాలువ పరిశుభ్రంగా మారింది. ఇదే కాలువపై గత ఏడాది గుర్రపు డెక్క పూడుకుపోవడంతో నీరుపారక గత తొలకరిలో వందలాది ఊడ్పుచేలు నీట మునిగి రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. అదే విధంగా సామర్లకోట కాలువలో కూడా ఉపాధి హామీ శ్రామికులు గుర్రపు డెక్కను తొలగించే పనిలో నిమగ్నమై ఉన్నారు. త్వరలోనే ఈ కాలువ కూడా సాగునీటికి ఆటంకం లేకుండా పరుగులు తీస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లుగా ఆలనా పాలనా లేని కాలువలకు ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో శుభ్రం చేస్తున్న తీరుకు రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జెఎన్‌రోడ్డు మునిసిపల్ పార్కులో ఎన్టీఆర్ జయంతి ని ఘనంగా జరిగాయి. ఈకార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ దగ్గర సూర్యనారాయణ, కోసూరి చండీప్రియ, కంటిపూడి రాజేంద్ర, చెన్నుపాటి భానుప్రసాద్, వైట్ల శ్రీనివాస్, కోర్పు రామారావు, పితాతారావు, కోట్ల కనకేష్, చొప్పర్ల భద్రరావు,వాకర్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

● ప్రభుత్వ బోధనాసుపత్రిలో వైద్యులు, నర్సులు, విద్యార్థుల యోగాభ్యాసన


రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో యోగాసనాలు వేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, ఉద్యోగులు

రాజమహేంద్రవరం అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని, ఆరోగ్యం సొంతమవుతుందని రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీసూర్యప్రభ అన్నారు. యోగాంధ్ర 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా గురువారం ఉదయం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో వైద్యులు, నర్సులు, మెడికోలు, ఆసుపత్రి సిబ్బంది యోగాసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, మనస్సుకు శాంతిని, ఆరోగ్యాన్ని, బలాన్ని ఇచ్చే సాధన అని పేర్కొన్నారు. యోగా గురువు కేఎస్‌వీ శ్రీధర్‌రెడ్డి, కర్రి కార్తీక్, రామచంద్రారెడ్డి, కర్రి హేమ నిర్మలారెడ్డి, చండీప్రియ యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యాన విధానాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి మౌనిక, మైక్రో బయాలజీ హెచ్‌వోడీ డాక్టర్ ఎం.భారతి, నర్సింగ్ సూపరింటెండెంట్ ప్రభావతి, మేనేజర్ కే.కేదారేశ్వరరావు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

బిక్కవోలు: యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యాధికారిణి దుర్గాదేవి తెలిపారు. యోగాంధ్ర సాధనలో భాగంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్నిశాఖల సిబ్బందికి యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. పలుయోగాసనాలు వారితో వేయించి వాటివల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి. శ్రీనివాస్, తహశిల్దార్ సత్యకృష్ణ, ఎంఈఓ సీహెచ్‌వివి. సత్యనారాయణ, ఏపీఓ జి. అగస్టీన్ కుమార్, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.


రాజానగరంలో యోగాంధ్ర శిక్షణలో ఎంపీడీవో ఝాన్సీ, తహసీల్దార్ జీఏఎల్ఎస్ దేవి

యోగాతో ఒత్తిడులు దూరం

రాజానగరం: ప్రస్తుత జీవనశైలిలో ఎదుర్కొంటున్న ఒత్తిడులు, ఒడిదుడుకలను యోగాతో జయించవచ్చని ఎంపీడీవో జేఏ ఝాన్సీ పేర్కొన్నారు. 11వఅంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన రాజానగరంలోని శ్రీరాజా కాండ్రేగుల జోగి జగన్నాదరావు పంతులు బహద్దూర్ వారి అన్నదాన సత్రంలో మండలస్థాయి అధికారులు, ఇతర ఉద్యోగులకు గురువారం యోగాపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా వివిధశాఖల అధికారులు మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈశిక్షణా తరగతులు నిర్వహి ంచామని ఎంపీడీవో తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గట్టి రామభాస్కర్ యోగ ప్రాముఖ్యతను వివరిస్తూ, గ్రామాల్లో యోగాపై విస్తృత ప్రచారం కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జే.ఏ. ఝాన్సీ, తహసీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతిదేవి, మండల పరిషత్ ఏవో ఎం.సుబ్రహ్మణ్యం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గట్టి రామభాస్కర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువుకు గోదావరి జలాలు

సరఫరా చేయాలి

దివాన్‌చెరువు, మే 29 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు గ్రామ వాసులకు తాగునీటి కోసం గోదావరి జలాలను సరఫరా చేయాలని సామాజిక కార్యకర్త సూరారపు డేవిడ్ రాజు విజ్ఞప్తి చేశారు. గురువారం ఇక్కడ విలేకరులతో ఆయన మాట్లాడుతూ గోదావరి జలాలు కోసం తమగ్రామం నుంచి పాలచర్ల కు పైపులైన్ ఏర్పాటుచేశారని అన్నారు. తమకు గోదావరి జలాలు అందించాలని గ్రామసభలో కూడా ప్రజలు తెలియజేశారన్నారు. ప్రస్తుతం కొంతమంది గ్రామస్థులు రాజమహేంద్రవరం వెళ్లి ట్యాంకులతో గోదావరి నీరు తెచ్చుకోవడం జరుగుతోందన్నారు. ఇది వ్యయప్రయాసలతో కూడినదని చెప్పారు. తమగ్రామానికి నలువైపులా కుళాయిలు ఏర్పాటు చేసి గోదావరి జలాలు సరఫరా చేయాలని అభ్యర్థించారు.తాను రాజమహేంద్రవరంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలిసి ఈ విషయమై వినతిపత్రం సమర్పించానని వారు సానుకూలంగా స్పందించారని డేవిడ్‌రాజు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు

అంతరాయం

రాజానగరం, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలో 33/11కేవీ వెలుగుబంద విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే 11కేవీ వెలుగుబంద ఫీడర్ వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈనెల 30న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ గురువారం తెలిపారు. దీంతో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వెలుగుబందతో పాటు జేహెచ్‌సీ కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

'ఇరిగేషన్ శాఖలో ఉద్యోగుల బదిలీలు

పారదర్శకంగా నిర్వహించాలి'


ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

ధవళేశ్వరం, మే 29 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం ఇరిగేషన్ శాఖలో ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని కోరుతూ ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్‌కు టీడీపీ నాయకులు వి.అప్పారావు, తలారి మూర్తి గురువారం వినతిపత్రం అందజేశారు. ఐదేళ్ల సర్వీసుపూర్తి చేసుకున్న ఉద్యోగులకు తప్పనిసరిగా స్థాన చలనం కల్పించాల్సి ఉండగా ఉద్యోగ సంఘం నాయకుల ముసుగులో కొందరు, సిఫార్సు లేఖలతో ఇంకొందరు బదిలీలు కాకుండా అక్కడే పాతుకుపోతున్నారని ఆరోపించారు. దీనివల్ల ధవళేశ్వరంనకు రావాల్సిన ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఉద్యోగుల బదిలీలను పాదర్శకంగా చేపట్టాలని కోరారు. ఇదే విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే ఇరిగేషన్ శాఖా మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని వారు అన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

గోపాలపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేదిలేదని వ్యవసాయ మార్కెట్ కమిటీ రీజనల్ డైరెక్టర్ సుధాకర్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తప రిచారు. జిల్లాలో ఇచ్చిన టార్గెట్‌ను ఇప్పటివరకు రూ.30కోట్ల 83లక్షలు లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.29కోట్ల16లక్షలు లక్ష్యాన్ని పూర్తి చేశామన్నారు. 95శాతం జిల్లావ్యాప్తంగా లక్ష్యాన్ని అధిక మించామని మిగిలిన లక్ష్యాన్ని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు


పిల్లలతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ

రాజమహేంద్రవరం, మే29(ఆంధ్రజ్యోతి): పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించడం ప్రధానమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. గురువారం ఆమె ప్రభుత్వ బాలబాలికల వసతి గృహమైన బాలసదనాన్ని సందర్శించారు. వసతులు, ఆహార నాణ్యత, తాగునీటిని పరిశీలించారు. సదనంలోని మరమ్మతులను ఎప్పటికప్పుడు చేయించా లని ఆదేశించారు. పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. వైద్య సహాయం అవసరమైన సందర్భంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయడానికి వీల్లేదన్నారు. సాతి సర్వే ప్రకారం ఆధార్ కార్డులు ప్రతిఒక్కరికీ ఉన్నాయా లేదా అనే విషయంపై ఆరా తీశారు. పిల్లలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఎలాంటి ఉచిత న్యాయసహాయం అవసరమైనా డీఎల్ఎస్ఏని సంప్రదించాలని సూచించారు.

నిరుద్యోగ యువతకు

ఉపాధి కరువు : సీపీఐ

రాజమహేంద్రవరం అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలోని యువత ఉపాధి, ఉద్యోగాలు లేక విలవిల్లాడుతున్నారని, తీవ్రమైన మానసిక ఆందోళన చెందుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని అపరాల సెక్షన్‌శాఖ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఏడాది యువత డిగ్రీలు, బీటెక్‌లు పూర్తి చేసుకుంటున్నా వారికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లేకుండా పోయాయని అన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ ఎన్నికల హామీ నెరవేర్చలేదన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో ముగ్గురు యువకులను అత్యంత కిరాతంగా నడిరోడ్డుపై కూర్చోబెట్టి కాళ్లపై విచక్షణారహితంగా కొట్టిన పోలీసులను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు కె.రాంబాబు, కొండలరావు, సప్ప రమణ, పి.లావణ్య, జి.హరినాథ్, కె.వేణు పాల్గొన్నారు.

బాల్యం నుంచి దేశభక్తిని పెంపొందించుకోవాలి

● ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి


రంగంపేటలో యువకులు ప్రదర్శిస్తున్న శిక్షణాంశాలను చూస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రంగంపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచి దేశభక్తిని పెంపొందించుకొని ఉత్తమ పౌరులుగా తయారు కావాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రంగంపేట ఎస్‌వీఎస్ ఇంగ్లీష మీడి యం స్కూల్లో మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ శతజయంతి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా పెద్దాపురం ఖండ ప్రారంభిక శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా లక్షమంది కార్యకర్తలు ఇటువంటి శిక్షణ పొందటం అభినందనీయమని, నేర్చుకున్న అంశాలు గ్రామస్థాయిలో విద్యార్థులకు, యువకులకు తెలిపి దేశభక్తిని, శారీరక దారుఢ్యాన్ని, పౌర విధుల్ని తెలుసుకొని అత్యున్నత ఆలోచనలతో ఉత్తమ పౌరులుగా ఎదగడానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రధానవక్తగా విచ్చేసిన విభాగ సంపర్క ప్రముఖ బులుసు జగదీష్ మాట్లాడుతూ ఆర్.ఎస్.ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ హెగ్డేవార్ దేశభక్తినిక్రమశిక్షణను, అంకిత భావాన్ని స్ఫూర్తిగా తీసుకొని సమాజ సేవకులుగా తయారు కావాలన్నారు. ఈ సందర్భంగా సుమారు 70మంది యువకులు మూడు రోజుల పాటు నేర్చుకున్న శిక్షణాంశాలను ప్రదర్శించారు. అంతకు ముందు ధ్వజానికి,భరతమాత, గురూజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ప్రచారకులు సింగన వీరవెంకట సత్యనారాయణ, తోట సూర్యభాస్కరరావు, మండల బీజేపీ అధ్యక్షుడు ఎం.సాయిరామ్, ఉపసర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, కూటమి నాయకులు పేపకాయల రామచంద్రరావు, ఉండవిల్లి గిరిబాబు, మండవిల్లి గుప్త, రవి శంఖర్, పోతుల వీరన్న, మాణిక్యం, యలమాటి రాంబాబు ఎస్వీఎస్ అధినేతలు మూర్తి, అనూష తదితరులు పాల్గొన్నారు.


సాంస్కృతిక కార్యక్రమంలో బాలబాలికలను అభినందిస్తున్న దృశ్యం

అలరించిన బాలబాలికల భరతనాట్యం

రాజమహేంద్రవరం కల్చరల్ మే 29(ఆంధ్రజ్యోతి): స్థానిక దామెర్ల రామారావు స్మారక చిత్రకళా మందిరంలో నెల రోజులుగా జరుగుచున్న బాలబాలికల వేసవి ఉచిత చిత్రకళ శిక్షణలో భాగంగా గురువారం జరిగిన ఫోక్ డాన్స్, కోలాటం, భరతనాట్యం, పాటలు కార్యక్రమాల్లో పలువురు బాలబాలికలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం రాష్ట్ర కన్వీనర్ దేశిరెడ్డి బలరాం నాయుడు, మద్దూరి అన్నపూర్ణయ్య సేవా సమితి వ్యవస్థాపక కార్యదర్శి బెజవాడ రంగారావు, తాడి సూరిబాబు, మాజేటి ఆర్ట్స్ వ్యవస్థాపకుడు మాజేటి ప్రకాష్, తారా నగేష్, గ్యాలరీ కేర్ టేకర్ ఆదిలక్ష్మి, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రజలపై

ఆస్తిపన్ను బాదుడు దారుణం

● సీపీఎం నాయకుల విమర్శలు

రాజమహేంద్రవరంఅర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పట్టణ ప్రజలపై ఆస్తిపన్ను బాదుడు దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ విమర్శించారు. ఈమేరకు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.పవన్, జిల్లా కమిటీ సభ్యుడు ఐ.సుబ్రహ్మణ్యంతో కలసి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణాల్లో మౌలిక సదుపాయాలను విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, తన ఖజానా నింపుకోవడానికి ప్రయత్నిస్తున్నదని తెలిపారు. ఒక వైపున విద్యుత్ భారాలతో ప్రజలు సతమతమవుతుంటే, మరోవైపున ఇంటిపన్నుల పెంపు బాదుడుతో మరింత భారం మోపుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే ఇంటింటి సర్వే ఆపాలని, ఆస్తి పన్ను పెంపు యోచన విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు.


అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న దృశ్యం

అవార్డు గ్రహీతకు సత్కారం

రాజమహేంద్రవరం సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోదావరి ఇంజనీరింగ్ కళాశాలలో మేథమెటిక్స్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కందర్ప వెంకట రామ శ్రీనివాస్‌కు సౌత్ వెస్టర్న్ యూనివర్శిటీ అమెరికా వారు డాక్టర్ ఆఫ్ సైన్సెస్ (డీఎస్‌సి) డిగ్రీ అవార్డు ప్రదానం చేశారు. ఢిల్లీలో 24న ఆయన అందుకున్నారు. ఈసందర్భంగా ఆయన వద్ద పనిచేస్తున్న స్కాలర్ వై.రాజశేఖర్, పూర్వ విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో మేథమెటిక్స్ అధ్యాపకులు గద్దే సుధాకర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి వికసిత్ కృషి అభియాన్


ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను సత్కరిస్తున్న అధికారులు

కోరుకొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ ఎంపీడీవో కార్యాలయంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌పై వెబ్‌కాస్ట్‌ను నిర్వహించారు. దేశమంతటా మే 29 నుంచి జూన్ 12 వరకు జరుగుతుందని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని డెవలప్‌మెంట్ కార్యాలయంలో కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా వ్యవసాయశాఖ, తూర్పుగోదావరి జిల్లాల సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రైతులే ప్రధాన శాస్త్రవేత్తలన్నారు. కార్యక్రమం లో సీతానగరం, కోరుకొండ, గోకవరం మండలాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రారంభ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో కేవీకే అధికారులు డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు(హెడ్), రఘు నందన్ (సస్యరక్షణాధికారి), మత్స్యశాఖ అధికారి డాక్టర్ బి.రవీంద్ర సొటెక్క, గృహ విజ్ఞాన శాఖాధికారి సంజయ్‌హెగ్డే తదితరు లతోపాటు పలువురు అధికారులు, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ ఉద్యోగుల సభను విజయవంతం చేయండి

రాజమహేంద్రవరం కల్చరల్ మే 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర మూడో కౌన్సిల్ సభలు జూన్ 5న విజయవాడలో జరగనున్నాయని వక్తలు తెలిపారు. ఈ సభలను జయప్రదం చేయడం ద్వారా ఉద్యోగుల ఐక్యతను చాటి చెప్పాలని తూర్పు గోదావరి ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పి.గిరిప్రసాద్‌వర్మ పిలుపునిచ్చారు. రాష్ట్ర కౌన్సిల్ సభల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం, సీపీఎస్ రద్దు వంటి డిమాండ్ల సాధనకు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

తాతారెడ్డి మృతి

టీడీపీకి తీరని లోటు

బిక్కవోలు, మే 29(ఆంధ్రజ్యోతి): కొంకుదురు ఉపసర్పంచ్ సత్తి తాతారెడ్డి మృతి టీడీపీకి తీరనిలోటని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం తాతారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నేతలు, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో

యువకుడి మృతి

గోపాలపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో యువకుడు ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన గోపాలపురం శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గోపాలపురం గ్రామానికి చెందిన తుంగా వంశీ(24) చిన్నవయస్సులోనే తల్లి చనిపోవడం, తండ్రి వేరొకపెళ్లి చేసుకోవ డంతో అమ్మమ్మ తాతయ్య వద్ద పెరిగాడని అన్నారు. అయితే ఇటీవల తాను ఒంటరిగా ఉంటున్నాడని అయితే బుధవారం సాయంత్ర ం నుంచి కనిపించక పోవ డంతో తమకు అనుమానం వచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారని అన్నారు. అయితే చెట్టుకు ఉరి వేసు కుని చనిపోవడంతో అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు మేనమామ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వై.సత్యనారాయణ గురువారం తెలిపారు.

ఏపీజీఈఏ రాష్ట్ర మూడో కౌన్సిల్‌ను విజయవంతం చేయాలి


కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీజీఈఏ నాయకులు

కొవ్వూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): జూన్ 5వ తేదీన విజయవాడలో జరిగే ఏపీజీఈఏ రాష్ట్ర కౌన్సిల్‌కు ఉద్యోగులు పెద్దఎత్తున తరలిరావాలని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పి.గిరి ప్రసాదవర్మ అన్నారు. గురువారం సాయంత్రం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపిజిఈఏ) రాష్ట్ర మూడవ కౌన్సిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముందుగా రాజమహేంద్రవరం జనరల్ హాస్పటల్, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, అనంతరం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పర్యటించి, ఉద్యోగులను రాష్ట్ర కౌన్సిల్ సభలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ ఈ కౌన్సిల్‌కి జిల్లా నుంచి అధికసంఖ్యలో ఉద్యోగులు తరలివచ్చి ఐక్యత ను చాటి చెప్పాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు పి.రవికుమార్ మాట్లాడుతూ ఈ సభలలో రాష్ట్ర ముఖ్యమం త్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వంటి ప్రముఖులు పాల్గొంటారన్నారు. రాజమహేంద్రవరం నగర అధ్య క్షుడు జి.బి.విజయకుమార్ మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం 12వ పీఆర్ సీ కమిషన్‌ను నియమించాలని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏ ప్రభుత్వఉద్యోగికి అన్యాయం జరుగకుండా ఏపీజీఈఏ కృషి చేస్తుందని భరో సా ఇచ్చారు. రాష్ట్ర కౌన్సిల్ సభలలో కాంట్రా క్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం, సీపీఎస్ రద్దు వంటి అంశా లపై చర్చించి, వాటి సాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో దినేష్, రెహమాన్, నాగేశ్వరరావు, భద్ర, ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.


అనధికార నిర్మాణాల క్రమబద్ధీకరణకు

దరఖాస్తు చేసుకోవాలి

కొవ్వూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): అభ్యంతరాలు లేని ప్రభుత్వ పోరంబోకు స్థలాల ను అనధికారికంగా నిర్మించిన పక్కా ఇంటి నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తున్నట్లు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. 2025 జనవరి 29న రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన జీవో నెం. నెం. 30 ప్రకారం 2019 అక్టోబరు 15వ తేదీ కంటే ముందుగా అభ్యంతరాలు లేని ప్రభుత్వ స్థలాల్లో పక్కా ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత కలిగినవారు డివిజన్ పరిధిలో అభ్యంతరంలేని పోరంబోకు స్థ లాల్లో అనధికారికంగా నిర్మించిన పక్కా ఇంటి నిర్మాణాలు చేపట్టిన వారి ఇళ్లను ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తుందన్నారు. అనధికారికంగా ఇంటి నిర్మాణాలు చేపట్టిన ఇంటి యజమానులు క్రమబద్ధీకరణకు సంబంధి ంచి ఇంటిపన్ను, కరెంటు బిల్లులతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హతకలిగిన వారు సచివాలయాలు, వీఆర్వోల ద్వారా దరఖాస్తులను అందించవచ్చునన్నారు.

రేపు సీఎం రాక

- కోనసీమ జిల్లా ముమ్మిడివరం, కాట్రేనకోన మండలాల్లో అధికారిక కార్యక్రమాలో పాల్గొననున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఏర్పాట్లు చేస్తున్న కోనసీమ జిల్లా అధికార యంత్రాంగం
- సీఎం పర్యటన షెడ్యూల్ విడుదల



అమలాపురం, మే 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 31న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రానున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో గల ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లో ఏర్పాటు చేసిన అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పీ4లో భాగంగా పేదల దత్తత కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత ఉపాధి హామీ కూలీలతో మమేకమవుతారు. నలుగురు పెన్షనర్లతో మాట్లాడతారు. తర్వాత ముమ్మిడివరం నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారు.

సీఎం పర్యటన సాగేదిలా..

- ఆరోజు ఉదయం 9.30గంటలకు డిల్లీలోని జనపథ్ నుంచి బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 10.10గంటలకు డిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరతారు.
- 12.25 గంటలకు రాజమహేంద్రవరం మధురపూడి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 12.30 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరతారు.
- 12.50గంటలకు ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 12.50 గంటల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు సీఎంను కలుస్తారు.
- 1.20 గంటలనుంచి 2.05గంటల వరకు పీ4 కార్యక్రమంతోపాటు పింఛన్ల పంపిణీ తర్వాత గ్రామస్తులతో భేటీ అవుతారు.
- 2.05 గంటలకు బయలుదేరి సీహెచ్ గున్నేపల్లి ట్యాంక్ ఏరియాకు చేరుకుంటారు.
- 2.10 గంటల నుంచి 3.30 గంటల వరకు గ్రామంలో ప్రజలతో మాట్లాడతారు.
- 3.35గంటల నుంచి 5 గంటల వరకు అక్కడే టీడీపీ కేడర్‌తో సమావేశమవుతారు.
- 5.10 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుని హెలికాప్టర్‌లో బయలుదేరతారు.
- 6 గంటలకు తాడేపల్లి మండలం ఉండవల్లిలోని స్వగృహానికి చేరుకుంటారు.

తవ్వేదెవరు

- జిల్లాకు కేటాయించిన ఇసుక ర్యాంపుల వెనుక ఎవరున్నారు
- కాంట్రాక్టు కంపెనీ కాకుండా ఇంకెవరు పెత్తనం చేస్తున్నారు
- ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'ఇసుకాసురుడు' కథనంపై కాకినాడ కలెక్టర్ ఆరా
- స్టాకు యార్డులకు ఇసుక రాకుండా అడ్డుకునే ప్రయత్నాలపై ఆగ్రహం
- ఎప్పటికప్పుడు స్టాకు యార్డులకు వస్తోన్న ఇసుకపై పర్యవేక్షణ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా ఇసుక అవసరాలు తీర్చడానికి కేటాయించిన ర్యాంపుల్లో వైసీపీ నేత ద్వారంపూడి అనుచరుడి పెత్తనంపై జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆరా తీశారు. కోనసీమ జిల్లాలోని పొడగట్లపల్లి, తూర్పుగోదావరిజిల్లాలో కాటవరం ర్యాంపులు అధికారికంగా కాంట్రాక్టు కంపెనీలకు కేటాయిస్తే వీటిలో వేరొకరు పాగా వేసి ఇసుక అక్రమాలు చేస్తుండడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అసలు తెరవెనుక దందా చేస్తోన్న నేత గురించి ఆరా తీశారు. రీచ్‌లు దక్కించుకున్న కంపెనీలకు, సదరు చీకటి నేతకు సంబంధాలేంటనేదానిపై కలెక్టరేట్ అధికారుల ద్వారా లోతుగా గుట్టు సేకరించారు. రీచ్‌లపై అనధికార వ్యక్తుల పెత్తనం సహించేదిలేదని అధికారులవద్ద ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోపక్క గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రధాన అనుచరుడైన ఓ హోటల్‌ను ఇంటి పేరుగా మార్చుకున్న వైసీపీ నేత చెలరేగిపోయాడు. ఎక్కడికక్కడ ఉమ్మడి జిల్లాలో గ్రావెల్ అక్రమాలకు తెగబడ్డాడు. ఇప్పుడు ప్రభుత్వం మారినా అదే నేత ఇంకా దందాలు చేయడంపై 'ఆంధ్రజ్యోతి'లో గురువారం 'ఇసుకాసురుడు' అనే శీర్షికతో కథనం వెలువడింది. దీనిపై కాకినాడ కలెక్టర్ ఆరాతీశారు. జిల్లాలో ఇసుక స్టాకుయార్డులకు రీచ్‌ల నుంచి ఇసుక ఇవ్వకుండా ద్వారంపూడి అనుచరుడు బెదిరింపులకు దిగుతున్న వ్యక్తి ఎవరనేదానిపై ఆరా తీశారు. అసలు రీచ్‌ల్లో ఏం జరుగుతుందో వివరాలు రప్పించుకున్నారు. రీచ్‌ల్లో అనధికార వ్యక్తుల పెత్తనం చేస్తే కాంట్రాక్టు రద్దు చేయడానికి కూడా వెనుకాడేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. అసలే వచ్చేది వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలో ప్రజలకు ఇసుక ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి స్టాకుయార్డులోను ఇసుక తగినంత ఉండేలా కలెక్టర్ స్వయంగా పర్యవేక్షణ మొదలుపెట్టారు. ప్రస్తుతం జిల్లాలో పెద్దాపురం,పిఠాపురం, కాకినాడ, కాకినాడలో ఉప్పలంక, కాకినాడ అర్బన్, ప్రత్తిపాడు స్టాకుయార్డుల్లో ఈనెల 27నాటికి 1,37,791మెట్రిక్ టన్నులు ఉందని అధికారులు వివరించారు. ఇదిరోజురోజుకు మారుతుందని తెలిపారు. మరోపక్క తమకు దక్కిన రీచ్‌ల వెనుక వైసీపీ నేత పెత్తనం కొనసాగుతుందన్న విషయం బయటకు పొక్కడంతో సదరు నిర్వాహకులు ఆంధ్రజ్యోతి కథనం ఉలిక్కిపడ్డారు. ఏ స్టాకు యార్డు నుంచి నిజాలు బయటకు పొక్కాయి అనేదానిపై ఆరా తీయడం మొదలుపెట్టారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి 8

పుష్ప తరహాలో గంజాయి స్మగ్లింగ్

- ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పట్టివేత
- లారీ సహా రూ.22లక్షల విలువైన 730 కిలోల గంజాయి స్వాధీనం
- ఐదురోజుల క్రితం దేవరపల్లిలో మోటారుసైకిల్‌ను ఢీకొన్న లారీడ్రైవర్
- పోలీసులకు భయపడి అప్పటినుంచి లారీని యర్నగూడెంలో దాచిన వైనం
- సమాచారంతో పరిసరాల్లో వెతికి లారీని పట్టుకున్న పోలీసులు
- లారీ క్యాబిన్ వెనుక రహస్య అర కింద గంజాయి గుర్తింపు
- లారీడ్రైవర్ అరెస్టు.. మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు

మెయిన్‌లో..



వివరాలు వెల్లడిస్తున్న దేవరపల్లి పోలీసులు



లారీ క్యాబిన్ వెనుక ఏర్పాటు రహస్య అర

కొంచెమే పెంపు

ఆంధ్రజ్యోతి-రాజమహేంద్రవరం:

ధాన్యానికి కనీస మద్దతు ధర కేంద్రం పెంచింది. క్వింటాలుకు రూ.69 పెంచగా గ్రేడ్-ఏ రకం రూ.2,369, సాధారణ రకం రూ.2,252కి పెరిగింది. ఉమ్మడి జిల్లాలో 14.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి కొనుగోలుకు పౌరసరఫరాలశాఖ సిద్ధం చేస్తోంది. కాగా, మద్దతు ధర కొంచమే పెంచడంపై రైతులు పెదవి విరుస్తున్నారు.

నో..పరేషన్



- ఉమ్మడి జిల్లాలో జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల్లోనే బియ్యం
- పిఠాపురంలో ప్రారంభించనున్న సివిల్ సప్లయిస్ మంత్రి నాదెండ్ల
- ప్రతినెలా 1వతేదీనుంచి 15తేదీ వరకు దుకాణాల్లో ఇచ్చేలా ప్రణాళిక
- వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ ఇచ్చేలా ఏర్పాట్లు
- పక్కాగా కొత్త విధానం అమలయ్యేలా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2,857రేషన్ దుకాణాల్లో 17.46 లక్షల మంది కార్డుదారులకు 26లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం
- తూకం మోసం లేకుండా ఎలక్ట్రానిక్ కాటాలపై అధికారుల పరిశీలన
- ఎండీయూ వాహనాల రద్దుతో ఇకపై కార్డుదారులకు తీరిన కష్టాలు
- నచ్చినప్పుడు రేషన్‌డీలర్ వద్దకు వెళ్లి బియ్యం, సరుకులు తెచ్చుకునే వీలు
- గత ప్రభుత్వంలో బియ్యం వాహనాలతో కార్డుదారులకు నరకం
- ఎప్పుడు బియ్యం బండి వస్తుందో తెలియక పడిగాపులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

'ఎప్పుడు వస్తుందో తెలియదు.. ఎక్కడ ఉంటుందో తెలియదు.. ఎంతసేపు ఉంటుందో తెలియదు.. ఒకచోట మిస్సయితే.. మరో చోటకు వెళ్లి తెచ్చుకోవాలి. ఒక్కోసారి వాహనం కనిపించినా.. గంటల తరబడి సరుకుల కోసం పడిగాపులు.. ఒక్కోసారి బియ్యం లేవనే సమాధానం..' గత వైసీపీ ప్రభుత్వంలో రేషన్ సరకులు పంపిణీ చేసే ఎండీయూ వాహనాలతో రేషన్ కార్డుదారుల అనుభవాలివీ.. వీటన్నింటికీ చెక్ పెడుతూ.. కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక జూన్ ఒకటో తేదీ నుంచి నేరుగా రేషన్ దుకాణాల నుంచే సరకులు పంపిణీ చేసేలా ఏర్పాటు చేస్తోంది. వైసీపీ హయాంలో ఇంటింటికి రేషన్ సరకులు అందజేస్తామని చెప్పిన ప్రభుత్వం.. కార్డుదారులను నడి వీధిలో నిలబెట్టింది. ఈ సమస్యను చక్కదిద్దేందుకు కూటమి సర్కారు పాత విధానంలోనే రేషన్ దుకాణాల వద్దే సరకులు అందించేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,857 రేషన్ దుకాణాల్లో 17.46లక్షల మంది కార్డుదారులకు 26లక్షల మెట్రిక్‌టన్నుల బియ్యం పక్కాగా సరఫరా చేసేలా డీలర్లను అప్రమత్తం చేసింది. రేషన్‌దుకాణాల్లో తూకం మోసం లేకుండా ఎలక్ట్రానిక్ కాటాలపై అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.

బెంగ లేదిక..

జూన్ 1 నుంచి రేషన్‌దుకాణాల్లో బియ్యం పంపిణీ నేపథ్యంలో పౌరసరఫరాల సంస్థ, పౌరసరఫరాలశాఖల అధికారులు రేషన్ దుకాణాలకు సరకుల తరలింపు, కచ్చితమైన తూకంతో పేదలకు అందించే చర్యలు మొదలుపెట్టారు. ఎంఎల్ఎస్ పాయింట్లు వద్ద వే బ్రిడ్జిలను పూర్తి స్థాయిలో సిద్ధం చేస్తున్నారు. మరో మూడురోజులు మాత్రమే సమయం ఉండడంతో రేషన్ షాపులను సన్నద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. రేషన్ సరకుల సరఫరాలో లోటుపాట్లపై డీలర్ల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ఇక తూనికలు, కొలతలశాఖల అధికారులు కూడా రేషన్ దుకాణాల్లోని కచ్చితమైన తూకాలు ఉండేలా యంత్రాలను పరిశీలిస్తున్నారు. చాలా వరకు డీలర్ల వద్ద ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు పాడైపోయిన నేపథ్యంలో వాటిని మరోసారి తనిఖీ చేసి, సీల్ వేస్తున్నారు. ఈ పనిలో ఐదురోజులుగా ఈ శాఖ అధికారులు బిజీగా ఉన్నారు. ఈనెల 30వ తేదీలోపు మొత్తం రేషన్ దుకాణాలన్నింటికీ సరకును రవాణా చేసేలా పౌరసరఫరాలశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వైసీపీ హయాంలో..

కాగా రేషన్ బియ్యాన్ని నెలలో తనకు కావలసిన సమయంలో కార్డుదారులు రేషన్ దుకాణానికి వెళ్లి తెచ్చుకునే అవకాశం 2019 వరకు అమలవగా తర్వాత జగన్ వచ్చాక ఈ వ్యవస్థకు తూట్లు పొడిచారు. నచ్చిన రోజు, నచ్చిన సమయానికి రేషన్ దుకాణానికి వెళ్లి బియ్యం తెచ్చుకునే వెసులుబాటును రద్దు చేసి కార్డుదారులకు నరకం చూపించింది. తొలుత ఇంటింటికి వెళ్లి ఈ వాహనంలో బియ్యం పంచుతామని చెప్పి మాట మార్చారు. ఒక కాలనీకి వెళ్లి ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనం సైరన్‌తో ప్రదర్శిస్తే గంటల తరబడి ఆ కాలనీవాసులు నిలబడి బియ్యం తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఆరోజు వాహనం వద్దకు వెళ్లకపోతే ఆ నెల బియ్యం పోయిన పరిస్థితి తలెత్తింది. వేరే ప్రాంతంలో వాహనం కనిపిస్తే బియ్యం ఇచ్చేవారు కాదు. బియ్యం ఇచ్చినట్లే ఇచ్చి అక్కడే తిరిగి కొనేవారు. ఈ రేషన్ బియ్యం అంతా తిరిగి వైసీపీ నేతల కనుసన్నల్లో నడిచే రేషన్‌మాఫియాకు ఈ వాహనాలు తరలించేవి. రేషన్ మాఫియాకు ఇవి అడ్డగోలుగా ఉపయోగపడ్డాయి. బియ్యం వాహనాలను అప్పటి ప్రభుత్వం రూ.5.81లక్షల చొప్పున బ్యాంకు రుణంపై కొనుగోలు చేసి ఆపరేటర్లకు అందించింది. మొత్తం 72నెలల వాయిదాపై బ్యాంకునుంచి 2021, ఫిబ్రవరిలో రుణం తీసుకుంది. కాకినాడ జిల్లాలో 420, తూర్పుగోదావరి జిల్లాలో 364, కోనసీమ జిల్లాలో 355 వాహనాలను బ్యాంకు నుంచి రూ.66.19కోట్లు రుణం ద్వారా కొనుగోలు చేసింది. ఇప్పటికీ ఈరుణాన్ని ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ వాహనాలపై రూ.6.83కోట్లు బాకీ ఉంది.



కాకినాడ రంగయ్యనాయుడు వీధిలోని ఓ రేషన్ దుకాణంలో తూకపు యంత్రాలను పరిశీలిస్తున్న తూనికలు, కొలతలశాఖ అధికారులు

ఏం జిల్లాలో ఎన్నంటే..

కాకినాడ జిల్లాలో 1,060రేషన్ దుకాణాలు ఉండగా, వీటి పరిధిలో 6.43లక్షలమంది కార్డుదారులున్నారు. కోనసీమ జిల్లాలో 926 రేషన్ దుకాణాల్లో 5.38లక్షలమంది, తూర్పుగోదావరి జిల్లాలో 871దుకాణాల ద్వారా 5.65లక్షల మంది కార్డుదారులున్నారు. వీరందరికీ ఉమ్మడి జిల్లాలో 26లక్షల మెట్రిక్ టన్నుల వరకు రేషన్ బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. ఈ మేరకు అన్ని రేషన్ దుకాణాల్లో ఈ వ్యవస్థ పక్కాగా పనిచేసేలా మూడు జిల్లాల్లో పౌరసరఫరాలశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కార్డుదారులు నచ్చిన సమయంలో బియ్యం విడిపించుకునేందుకు వీలుగా 15రోజులపాటు దుకాణాల్లో బియ్యం ఉండేలా చూడాలని డీలర్లను ఆదేశించారు. ఈ నేపథ్యంలో రేషన్ దుకాణాల్లో ఈ నెల ఒకటి నుంచి 15 వరకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఈ దుకాణాలు తెరిచి ఉంచనున్నారు. షాపు పనివేళలు, ధరలు, సరకు నిల్వను సూచించే బోర్డును తప్పనిసరిగా ప్రదర్శించాలని ఇప్పటికే డీలర్లకు అధికారులు ఆదేశాలిచ్చారు. ఇక 65ఏళ్లు పైబడిన వారికి, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దకు వెళ్లి సరకులు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

రేపే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

- జూన్ 1 ఆదివారం కావడంతో ఒకరోజు ముందే సిద్ధం
- జిల్లాలో రూ.101.73కోట్లు
- 12న స్పౌజ్ పింఛన్లు

రాజమహేంద్రవరం, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పింఛనుదార్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జూన్ 1న ఆదివారం కావడంతో ఆ రోజు పంపిణీ చేయాల్సిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ఒకరోజు ముందే అంటే శనివారం రోజునే పంపిణీకి ఏర్పాట్లు చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. కలెక్టర్ ప్రశాంతి ఇప్పటికే ఏర్పాట్లు చేయించారు. జిల్లాలో మొత్తం 2,32,916మందికి రూ.101కోట్ల73లక్షల77వేల500 పంపిణీ చేయాల్సి ఉంది. ఈసొమ్మును బ్యాంక్‌ల నుంచి శుక్రవారమే డ్రా చేసేలా ఆదేశాలిచ్చారు. ఈనెల 31న శనివారం ఉదయంనుంచే పింఛన్ల పంపిణీ చేయడానికి సచివాలయ, ఇతర ఉద్యోగ సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. కొత్తగా స్పౌజ్ పింఛన్ల కింద భర్త చనిపోతే భార్యకు ఇచ్చే పింఛన్లను జూన్ 12న పంపిణీ చేయడానికి నిర్ణయించారు. వాటికి సంబంధించి న డబ్బును 11వతేదీనే బ్యాంక్‌ల నుంచి విత్‌డ్రా చేయనున్నారు. ఇక జిల్లాలో మండలాల వారీ పంపిణీ వివరాలివి. అనపర్తిలో రూ.43.2లక్షలు బిక్కవోలులో రూ.44.3లక్షలు, చాగల్లులో రూ.96.9లక్షలు, దేవరపల్లిలో రూ.46.6లక్షలు గోకవరంలో రూ.45.5లక్షలు, గోపాలపురంలో రూ.38.4లక్షలు, కడియంలో రూ.50.9లక్షలు, కోరుకొండలో రూ.54.1లక్షలు, కొవ్వూరులో రూ.43.2లక్షలు, కొవ్వూరు అర్బన్‌లో రూ.13.9లక్షలు, నల్లజర్లలో రూ.48.9లక్షలు, నిడదవోలులో రూ.44.9లక్షలు, నిడదవోలు అర్బన్‌లో రూ.18.7లక్షలు, పెరవలిలో రూ.43.6లక్షలు, రాజమండ్రిఅర్బన్‌లో రూ.12.34లక్షలు, రూరల్‌లో రూ.86.7లక్షలు రాజానగరంలో రూ.65.83లక్షలు, రంగంపేటలో 8701మందికిరూ.37.76లక్షలు, సీతానగరంలోరూ.48.6లక్షలు, ఉండ్రాజవరంలో రూ.45.1లక్షలు ఇవ్వనున్నారు.

సైనిక్ సంక్షేమ నిధికి రూ.6.37లక్షల విరాళాలు అందజేత



సైనిక్ వెల్ఫేర్ అధికారికి చెక్‌ను అందిస్తున్న కలెక్టర్, ఎస్పీ

రాజమహేంద్రవరం సిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సైనిక్ సంక్షేమ నిధికి వచ్చిన విరాళాలు రూ.6లక్షల37వేల790లను కలెక్టర్ ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ జిల్లా సైనిక్ సంక్షేమ అధికారికి అందజేశారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పీడీ డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల గ్రూపులు అందించిన నగదును గురువారం వారు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ దేశ రక్షణ కోసం పోరాడిన సైనికులకోసం సైనిక్ వెల్ఫేర్ ఫండ్ ప్రతిఒక్కరూ తమ వంతుగా స్వచ్ఛందంగా అందించి సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. స్వయం సహాయక సంఘాలు సైనిక్ వెల్ఫేర్ ఫండ్‌కు విరాళాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఎస్పీ నరసింహకిషోర్ మాట్లాడుతూ సైనిక్ సంక్షేమనిధి మాజీ సైనికులు, యుద్ధ వితంతువులు, దివ్యాంగులైన మాజీ సైనికులు, రక్షణ సిబ్బంది కుటుంబాల సంక్షేమ, పునరావాసం కోసం ఏర్పాటు చేశారన్నారు. ఈ నిధి ద్వారా వారి కోసం వివిధ సంక్షేమ పథకాలు, సహాయక కార్యక్రమాలు అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీఏఎస్ మూర్తి, సైనిక్ సంక్షేమ అధికారి సహాయ సంచాలకులు డాక్టర్ సత్యకుమార్, డీపీఎం బి.హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

ఇసుక జిల్లా కమిటీ మీటింగ్‌లో ఏపీఎస్‌ఏసీ నివేదికపై చర్చ

రికార్డులు పరిశీలించాలని కలెక్టర్ ఆదేశం



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

రాజమహేంద్రవరం, మే 29(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021, మే నుంచి 2024, మే వరకూ జిల్లాలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణ మొదలైంది. అప్పటి అక్రమ తవ్వకాల గురించి ఏపీఎస్ఏసీ, ఐటీ అండ్‌సీ విభాగం వైస్‌చైర్మన్ గూగుల్ ఎర్త్‌ప్రో డేటా ద్వారా హైరిజల్యూషన్ ఉపగ్రహ చిత్రాన్ని ఉపయోగించి నదులు, ఇసుక రీచ్‌ల్లో అక్రమ ఇసుక తవ్వకాల గురించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా ఇసుక కమిటీలో ఈ నివేదిక మీద చర్చించి ఆయాప్రాంతాల్లో తవ్వకాల మీద చర్యలు తీసుకోవాలని గనులశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ కోరడంతో కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన గురువారం జరిగిన జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో ఉపగ్రహ చిత్రాలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఆయా అంశాల మీద శాఖాపరంగా రికార్డులన్నీ పరిశీలించి వివరాలు ఇవ్వాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. త్వరలో ఈ అక్రమ తవ్వకాల బాగోతం బయటపడనుంది.అంతకుముందు జిల్లాలో ఇసుక పరిస్థితిని సమీక్షించారు. 15 ఓపెన్ రీచ్‌లు, 18 డీసిల్టేషన్ పాయింట్లు, 13, డీసిల్టేషన్ సరఫరా పాయింట్లు ఉన్నట్టు తెలిపారు. వర్షాకాలంలో ఇసుక ఇబ్బంది లేకుండా స్టాక్ పాయింట్లలో జిల్లా ఇసుక కమిటీ చైర్మన్ నిర్ణయించిన ధరకే విక్రయించాలని స్పష్టం చేశారు. నిర్ణయించిన ధరల బోర్డులు పెట్టాలని, స్టాక్ పాయింట్లవద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ ఎస్.చిన్నరాముడు, ఎస్పీ డి.నరసింహకిశోర్, మైన్స్ ఏడీ ఫణీంద్రరెడ్డి పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల నిల్వకు గోదాము కావాలి: డీఈవో

రాజమహేంద్రవరం సిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే 50లక్షల పాఠ్యపుస్తకాలను నిల్వచేసేందుకు అనువైన గోదాము కావాలని డీఈవో కె.వాసుదేవరావు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 10నుంచి 15వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల గోదాము అవసరమని తెలిపారు. అనువైన భవనం కలిగిన యజమానులు ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విక్రయశాల మేనేజరు ఫోన్ నెంబరు 6301222549 నెంబరును కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలని కోరారు.

2న డీసెట్ -2025 పరీక్ష

రాజమహేంద్రవరం సిటీ, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డైట్ కళాశాల ఫస్ట్ ఇయర్ ప్రవేశానికి నిర్వహిస్తున్న డీసెట్-2025 పరీక్ష వచ్చే నెల 2న రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాల డిజిటల్ జోన్ ఐడిజెడ్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు సంబంధించి ఎటువంటి అనుమానాలున్నా హెల్ప్‌లైన్ 9849894917, 7287089697 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

అర్జీల పరిష్కార స్థాయి తెలుసుకోవడానికి 1100కు డయల్ చేయండి: కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్ ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం కలెక్టరేట్‌తోపాటు డివిజన్, మండల స్థాయిల్లో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌లో ప్రజల అర్జీల పరిష్కార స్థాయిని తెలుసుకోవడానికి 1100కు డయల్ చేయవచ్చని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌పై ప్రజాసమస్యల పరిష్కార స్థాయిపై వివిధ మండలాలనుంచి వచ్చిన అర్జీదారులతో అధికారులతో కలెక్టర్ వ్యక్తిగతంగా సమావేశమయ్యారు.



కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీజీఈఏ నాయకులు

ఏపీజీఈఏ రాష్ట్ర మూడో కౌన్సిల్‌ను

విజయవంతం చేయాలి

● ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు గిరి ప్రసాదవర్మ

కొవ్వూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): జూన్ 5వ తేదీన విజయవాడలో జరిగే ఏపీజీఈఏ రాష్ట్ర కౌన్సిల్‌కు ఉద్యోగులు పెద్దఎత్తున తరలిరావాలని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పి.గిరి ప్రసాదవర్మ అన్నారు. గురువారం సాయంత్రం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపిజిఈఏ) రాష్ట్ర మూడవ కౌన్సిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముందుగా రాజమహేంద్రవరం జనరల్ హాస్పటల్, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, అనంతరం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పర్యటించి, ఉద్యోగులను రాష్ట్ర కౌన్సిల్ సభలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ ఈ కౌన్సిల్‌కి జిల్లా నుంచి అధికసంఖ్యలో ఉద్యో గులు తరలివచ్చి ఐక్యతను చాటి చెప్పాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు పి.రవికుమార్ మాట్లాడుతూ ఈ సభలలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వంటి ప్రముఖులు పాల్గొంటారన్నారు. రాజమహేంద్రవరం నగర అధ్యక్షుడు జి.బి.విజయకుమార్ మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏ ప్రభుత్వఉద్యోగికి అన్యాయం జరుగకుండా ఏపీజీఈఏ కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర కౌన్సిల్ సభలలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం, సీపీఎస్ రద్దు వంటి అంశా లపై చర్చించి, వాటి సాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో దినేష్, రెహమాన్, నాగేశ్వరరావు, భద్ర, ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

జవహర్‌కు ఎమ్మార్పీఎస్ నాయకుల సత్కారం



ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను గజమాలతో సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొవ్వూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టబోతున్న మాజీమంత్రి కె.ఎస్.జవహర్‌ను జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం జవహర్‌ను ఆయన నివాసంలో జిల్లాకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు కలుసుకుని గజమాలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మద్దాల ఏసుపాదం, బోయినపల్లి సుందరయ్య, కోరుమిల్లి విజయశేఖర్, దారా యేసురత్నం, ముప్పిడి రాజు, ఆకుమర్తి చిన్న, మందపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

పోతవరంలో గంగానమ్మ జాతర ప్రారంభం

●బంధుమిత్రులతో పండుగ వాతావరణం

● ఆకట్టుకున్న విద్యుత్ అలంకరణ



పోతవరం గ్రామ దేవత గంగానమ్మ

నల్లజర్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): పోతవరం గంగానమ్మ జాతర మహోత్సవం వైభవంగా ప్రారంభించారు. గురువారం గ్రామ దేవత గంగానమ్మను ఊరేగింపుగా ఆలయం నుంచి పుట్టింటి వారైన పసు మర్తి కృష్ణ కుటుంబీకుల నుంచి అత్తింటి వారైన గంటా కృష్ణ కుటుంబీకుల వద్దకు తీసుకుని వెళ్లి అనంతరం గ్రామంలోని గుడిసెలో అమ్మవారిని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ముందుగా ఊరి పొలిమేరలకు మామిడి తోరణాలు కట్టి, అమ్మవారికి గణపతి పూజ, అభిషేకాలు, మంగళహారతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ప్రారంభమైన ఈ జాతర మహోత్సవం జూన్ 15వ తేదీవరకు జరుగుతుందని ఉత్సవకమిటీ సభ్యులు పేర్కొంటున్నారు. 39సంవత్సరాల తరువాత ఈ జాతర జరుగు తుందని గ్రామపెద్దలు పేర్కొంటున్నారు. జాతర మహోత్సవం కోసం దూర ప్రాంతాల్లో ఉన్న ఆడపడుచులు, బంధుమిత్రులు కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు.



గ్రామ దేవత గంగానమ్మను ఊరేగిస్తున్న గ్రామస్థులు

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

● వ్యవసాయ మార్కెట్ కమిటీ రీజనల్ డైరెక్టర్ సుధాకర్



గోపాలపురం ఏఎంసీలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌జేడీ సుధాకర్

గోపాలపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేదిలేదని వ్యవసాయ మార్కెట్ కమిటీ రీజనల్ డైరెక్టర్ సుధాకర్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తప రిచారు. జిల్లాలో ఇచ్చిన టార్గెట్‌ను ఇప్పటివరకు రూ.30కోట్ల 83లక్షలు లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.29కోట్ల16లక్షలు లక్ష్యాన్ని పూర్తి చేశామన్నారు. 95శాతం జిల్లావ్యా ప్తంగా లక్ష్యాన్ని అధిక మించామని మిగిలిన లక్ష్యాన్ని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఆయన వెంట ఏఎంసీ కార్యదర్శి ఎన్‌వీవీ .సత్యనారాయణ, సూపర్ వైజర్ ఎం.కొండలరావు ఉన్నారు.

'సర్వేశ్వరరావు మృతి టీడీపీకి తీరని లోటు'

పెరవలి, మే 29(ఆంధ్రజ్యోతి): సీనియర్ టీడీపీ నాయకుడు బండారు సర్వేశ్వరరావు(82) మృతి చెందడం పార్టీకి లోటని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు సలాది కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బొడ్డు రామాంజనేయులు, సలాది శ్రీహరి, రాపాక ప్రమీల సంతాపం తెలిపినవారిలో ఉన్నారు.



సర్వేశ్వరరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

యోగాపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం

● ప్రణాళికశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ లాలం అప్పలకొండ ● యోగాంధ్ర రిజిస్ట్రేషన్‌ల పరిశీలన



కొవ్వూరు సంస్కృత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్, తహసీల్దార్ దుర్గాప్రసాద్



రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో యోగాసనాలు వేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, వైద్య ఉద్యోగులు



ఆరికిరేవులలో యోగాంధ్ర రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ప్రణాళికశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ లాలం అప్పలకొండ

కొవ్వూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): యోగాపై ఆశక్తి కలిగిన ప్రతిఒక్కరితో యోగాంధ్ర రిజిస్ట్రేషన్ యాప్‌లో నమోదు చేయించాలని ప్రణాళిక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ లాలం అప్పలకొండ అన్నారు. కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో జరుగుతున్న యోగాంధ్ర రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. యోగాంధ్ర రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలనలో భాగంగా గురువారం కొవ్వూరు మండలంలో పర్యటించారు. డి.ఆర్.డి.ఏ. సిబ్బందితో యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్లను పూర్తిచేయించారు. ఈ సందర్భంగా ప్రణాళికశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ లాలం అప్పలకొండ మాట్లాడుతూ జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మే 21నుంచి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు యోగాపై అవగాహన కల్పిస్తామన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనడానికి దేశప్రధాని నరేంద్ర మోదీ విశాఖపట్నం వస్తున్నారన్నారు. ప్రతిఒక్కరూ యోగాంధ్ర యాప్ తమ పేర్లను నమోదు చేసుకుని అవకాశం ఉన్న వారంతా విశాఖపట్నం తరలిరావాలన్నారు. అక్కడకురాలేని వారు తమ సచివాలయాల పరిధిలో జరిగే యోగాంధ్ర కార్యక్రమాలలో పాల్గొనాలన్నారు. ఉప గణాంక అధికారి సోమరాజు, సహాయ గణాంక అధికారి జోడాల వెంకట్ పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

యోగాతో ఒత్తిడిని దూరం చేసుకోవచ్చునని మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ అన్నారు. కొవ్వూరు ఆంధ్రగీర్వాణ విద్యాపీఠంలోని సంస్కృత కళాశాల ప్రాంగణంలో గురువారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్‌లతోపాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు యోగా సాధన చేశారు. మాస్టర్ ట్రైనీలు పెనుమత్స సత్యనారాయణరాజు, పెనుమత్స సరోజినీలు యోగాపై శిక్షణను అందించి, అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. కార్యదర్శులు తమ సచివాలయం పరిధిలోని ప్రజలకు యోగా ప్రాముఖ్యతను వివరించి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. యోగాపై ఆశక్తి కలిగిన వారిని యోగాంధ్ర యాప్‌లో నమోదు చేయించాలన్నారు. ఎంఈవో రామకిషోర్, హెల్త్ వర్కర్లు, వార్డు సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖండవల్లిలోయోగా క్లాసులు

పెరవలి: యోగా సాధన ద్వారా మన శరీర ఆరోగ్యం పెంపొందించడంతోపాటు మానసిక ఆరోగ్యం కూడా పెంపొందిస్తుందని తహసీల్దార్ అచ్యుత కుమారి పేర్కొన్నారు. ఖండవల్లిలో యోగా ప్రాధాన్యతపై అవగాహన కల్పించేందుకు యోగా క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీఒక్కరూ దయనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో పద్మజ, గ్రామ రైతులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



యోగాలోపాల్గొన్న తహసీల్దార్ అచ్యుత కుమారి

యోగాతో శారీక, మానసిక ఆరోగ్యం

● ప్రభుత్వ బోధనాసుపత్రిలో వైద్యులు, నర్సులు, విద్యార్థుల యోగాభ్యాసన

రాజమహేంద్రవరం అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని, ఆరోగ్యం సొంతమవుతుందని రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీసూర్యప్రభ అన్నారు. యోగాంధ్ర 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా గురువారం ఉదయం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో వైద్యులు, నర్సులు, మెడికోలు, ఆసుపత్రి సిబ్బంది యోగాసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమేకాదని, మనస్సుకు శాంతిని, ఆరోగ్యాన్ని, బలాన్ని ఇచ్చే సాధన అని పేర్కొన్నారు. యోగా గురువు కేఎస్‌వీ శ్రీధర్‌రెడ్డి, కర్రి కార్తీక్, రామచంద్రారెడ్డి, కర్రి హేమ నిర్మలారెడ్డి, చండీప్రియ యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యాన విధానాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి మౌనిక, మైక్రో బయాలజీ హెచ్‌వోడీ డాక్టర్ ఎం.భారతి, నర్సింగ్ సూపరింటెండెంట్ ప్రభావతి, మేనేజర్ కే.కేదారేశ్వరరావు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాడిపూడి

ఇసుక ర్యాంప్ ఆకస్మిక తనిఖీ



తాడిపూడి ఇసుక ర్యాంపులో రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీవో రాణీ సుస్మిత

తాళ్లపూడి, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాడిపూడి ఓపెన్ ఇసుక ర్యాంపును గురువారం ఆర్డీవో రాణీ సుస్మిత ఆకస్మిక తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడుతూ ఇక్కడ ఎటువంటి నిబంధనలు అతిక్రమించడం లేదన్నారు. ఇక్కడ రెండు సెమీ మెకనైజ్డ్ రీచ్‌లు, రెండు బోట్స్‌మెన్ సొసైటీ ర్యాంపు ఒకటి ఉందని తెలిపారు. ఈ సెమీ మెకనైజ్డ్ ర్యాంపులో నాలుగు మినీ ఎక్స్‌కవేటర్ మిషన్లతో పనిచేయవచ్చని తెలిపారు. ఈ రీచ్‌లో లక్ష మెట్రిక్ టన్నులవరకూ పర్మిషన్ ఇచ్చా మని ఇప్పటివరకూ 8500 మెట్రిక్ టన్నులు రవాణా చేశారని ఇక్కడ జియో కోఆర్డినేట్‌లు ఏర్పాటు చేయడం నాలుగు రోజులు ఆల స్యమైందన్నారు. తాడిపూడి రీచ్‌లో అమ్మకాల కంటే ఏలూరు స్టాక్ పాయింట్‌కి నిర్ణయించిన మేరకు ఇసుక తరలింపు జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోహనభారతి, ఎస్ఐ రామకృష్ణ, మైనింగ్‌శాఖ అధికారులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి'

రాజమహేంద్రవరం, మే29(ఆంధ్రజ్యోతి): పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించడం ప్రధాన మని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. గురువారం ఆమె ప్రభుత్వ బాలబాలికల వసతి గృహమైన బాలసదనాన్ని సందర్శించారు. వసతు లు, ఆహార నాణ్యత, తాగునీటిని పరిశీలించారు. సదనంలోని మరమ్మతులను ఎప్పటికప్పుడు చేయించాలని ఆదేశించారు. పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. వైద్య సహాయం అవసరమైన సందర్భంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయడానికి వీల్లేదన్నారు. సాతి సర్వే ప్రకారం ఆధార్‌కార్డులు ప్రతిఒక్కరికీ ఉన్నాయా లేదా అనే విషయంపై ఆరాతీశారు. పిల్లలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఎలాంటి ఉచిత న్యాయసహాయం అవసరమైనా డీఎల్ఎస్ఏని సంప్ర దించాలని సూచించారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కరవు : సీపీఐ

రాజమహేంద్రవరం అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలోని యువత ఉపాధి, ఉద్యోగాలు లేక విలవిల్లాడుతున్నారని, తీవ్రమైన మానసిక ఆందోళన చెందుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని అపరాల సెక్షన్‌శాఖ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఏడాది యువత డిగ్రీలు, బీటెక్‌లు పూర్తి చేసుకుంటున్నా వారికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లేకుండా పోయాయని అన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ ఎన్నికల హామీ నెరవేర్చలేదన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో ముగ్గురు యువకులను అత్యంత కిరాతంగా నడిరోడ్డుపై కూర్చోబెట్టి కాళ్లపై విచక్షణారహితంగా కొట్టిన పోలీసులను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కె.రాంబాబు, కొండలరావు, రమణ, లావణ్య, హరినాథ్, వేణు పాల్గొన్నారు.

తెలుగుభాషపై విద్యార్థులకు అవగాహన



తెలుగు భాషపై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్ సోమనాథ్

నల్లజర్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం నల్లజర్లశాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు తెలుగు భాషపై అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్ సోమనాథ్ మాట్లాడుతూ మన మాతృ భాష తెలుగుభాష అని ప్రతివిద్యార్థి తెలుగు భాషపై మక్కువ చూపించాలన్నారు. తెలుగు కవులు రచి ంచిన పద్యాలు, వాటిభావాలను తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు చెస్, క్యారమ్స్ వంటి ఇండోర్‌గేమ్స్‌ను ప్రాక్టీస్ చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు ఏ.వి.రమణ పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



మృతుడు తుంగా వంశీ(ఫైల్)

గోపాలపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో యువకుడు ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన గోపాలపురం శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గోపాలపురం గ్రామానికి చెందిన తుంగా వంశీ(24) చిన్నవయస్సులోనే తల్లి చనిపోవడం, తండ్రి వేరొకపెళ్లి చేసుకోవడంతో అమ్మమ్మ తాతయ్య వద్ద పెరిగాడని అన్నారు. అయితే ఇటీవల తాను ఒంటరిగా ఉంటున్నాడని అయితే బుధవారం సాయంత్రం నుంచి కనిపించక పోవడంతో తమకు అనుమానం వచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారని అన్నారు. అయితే చెట్టుకు ఉరి వేసుకుని చనిపోవడంతో అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు మేనమామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వై.సత్యనారాయణ గురువారం తెలిపారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'ఇరిగేషన్ ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి'

ధవళేశ్వరం, మే 29 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం ఇరిగేషన్ శాఖలో ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని కోరుతూ ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్‌కు టీడీపీ నాయకులు వి.అప్పారావు, తలారి మూర్తి గురువారం వినతిపత్రం అందజేశారు. ఐదేళ్ల సర్వీసుపూర్తి చేసుకున్న ఉద్యోగులకు తప్పనిసరిగా స్థానచలనం కల్పించాల్సి ఉండగా ఉద్యోగ సంఘం నాయకుల ముసుగులో కొందరు, సిఫార్సు లేఖలతో ఇంకొందరు బదిలీలు కాకుండా అక్కడే పాతుకుపోతున్నారని ఆరోపించారు. ఇదే విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే ఇరిగేషన్ శాఖా మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని వారు అన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

రాజమహేంద్రవరంకల్చరల్, మే29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జెఎన్‌రోడ్డు మునిసిపల్ పార్కులో ఎన్టీఆర్ జయంతిని ఘనంగా జరిగాయి. ఈకార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ దగ్గర సూర్యనారాయణ, కోసూరి చండీప్రియ, కంటిపూడి రాజేంద్ర, చెన్నుపాటి భానుప్రసాద్, వైట్ల శ్రీనివాస్, కోర్పు రామారావు, పితాతారావు, కోట్ల కనకేష్, చొప్పర్ల భద్రరావు,వాకర్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి

కొవ్వూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): అభ్యంతరాలు లేని ప్రభుత్వ పోరంబోకు స్థలాలను అనధికారికంగా నిర్మించిన పక్కా ఇంటి నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తున్నట్లు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. 2025 జనవరి 29న రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన జీవో నెం. నెం. 30 ప్రకారం 2019 అక్టోబరు 15వ తేదీ కంటే ముందుగా అభ్యంతరాలు లేని ప్రభుత్వ స్థలాల్లో పక్కా ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత కలిగినవారు డివిజన్ పరిధిలో అభ్యంతరంలేని పోరంబోకు స్థలాల్లో అనధికారికంగా నిర్మించిన పక్కా ఇంటి నిర్మాణాలు చేపట్టిన వారి ఇళ్లను ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తుందన్నారు. అనధికారికంగా ఇంటి నిర్మాణాలు చేపట్టిన ఇంటి యజమానులు క్రమబద్ధీకరణకు సంబంధించి ఇంటిపన్ను, కరెంటు బిల్లులతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హతకలిగిన వారు సచివాలయాలు, వీఆర్వోల ద్వారా దరఖాస్తులను అందించవచ్చునన్నారు. మాస్టర్ ప్లాన్ పరిధిలో, శ్మశానవాటికలు, రహదారి విస్తరణ, రక్షిత మంచినీటి పథకం, ప్రభుత్వ రిజర్వు స్థలాలు, చెరువులు, ప్రభుత్వ అవసరాలకు ఉపయోగపడే భూములను ఆక్ర మించుకున్న వారికి ఈ క్రమబద్ధీకరణ పథకం వర్తించదన్నారు.

సమిశ్రగూడెం ఎస్ఐగా బాలాజీ సుందరరావు



నిడదవోలు, మే 29 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం సమిశ్రగూడెం పోలీస్ స్టేషన్‌కు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎల్.బాలాజీ సుందరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం సీసీఎస్ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై సమిశ్రగూడెం వచ్చారు. అంతకుముందు కడియం, విజయవాడలో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ బాలాజీ సుందరరావు మాట్లాడుతూ స్థానికులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణతోపాటు ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన వీరబాబు సీఐడీ విభాగానికి బదిలీపై వెళ్లారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెరవలి, మే 29(ఆంధ్రజ్యోతి): ఈనెల 30వ తేదీ శుక్రవారం కొన్ని గ్రామాల్లో పరిధిలో విద్యుత్‌సరఫరా అంతరాయం కలుగుతుందని ఏఈ నారాయణ అప్పారావు తెలిపారు. సబ్‌స్టేషన్ మరమ్మత్తులు విద్యుత్ లైన్‌లు మరమ్మత్తులు చేయనున్న సందర్భంగా అంతరాయం కలుగుతుందన్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కడింపాడు, పిట్టవేమవరం గ్రామాలకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆ గ్రామాల్లో ఉదయం 5 నుంచి 6 గంటల వరకు మళ్ళీ ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. అదేవిధంగా పెరవలి సబ్‌స్టేషన్‌పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు అంతరాయం కలుగుతుందని దీనివల్ల కాకరపర్రు, తీపర్రు, పెరవలి, అజ్జరం, కాపవరం, ముక్కామల, ఖండవల్లి, నల్లాకులవారిపాలెం, కొత్తపల్లి గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు.

దేవరపల్లి: మండలంలోని రామన్నపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఉదయం 8.30నుంచి 1.30 నిమిషాల వరకు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు వినియోగదారులు సహకరించాలని నిడదవోలు విద్యుత్‌శాఖ డీఈ నారాయణ అప్పారావు తెలిపారు.

గోపాలపురం ఎస్ఐగా మనోహర్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ మనోహర్

గోపాలపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం ఎస్ఐగా పీ.మనోహర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈయన తూర్పుగోదావరి జిల్లా రాజానగరం ఎస్ఐగా పనిచేసి సాధారణ బదిలీల్లో భాగంగా గోపాలపురం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో చట్టానికి లోబడి కఠినంగావ్యవహరిస్తానని అన్నారు.

'ఆస్తి పన్ను బాదుడు దారుణం'

రాజమహేంద్రవరంఅర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పట్టణ ప్రజలపై ఆస్తిపన్ను బాదుడు దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ విమర్శించారు. ఈమేరకు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.పవన్, జిల్లా కమిటీ సభ్యుడు ఐ.సుబ్రహ్మణ్యంతో కలసి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణాల్లో మౌలిక సదుపాయాలను విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, తన ఖజానా నింపుకోవడానికి ప్రయత్నిస్తున్నదని తెలిపారు. ఒక వైపున విద్యుత్ భారాలతో ప్రజలు సతమతమవుతుంటే, మరోవైపున ఇంటిపన్నుల పెంపు బాదుడుతో మరింత భారం మోపుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే ఇంటింటి సర్వే ఆపాలని, ఆస్తి పన్ను పెంపు యోచన విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు.